ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

3



చిత్తూరు జిల్లా వార్తలు

సోమవారం 1 జూలై 2024

- పుంగనూరులో పెద్దిరెడ్డి కుటుంబానికి వరుస షాకులు
- ఇటీవల రామచంద్రారెడ్డి.. నిన్న ఎంపీ మిథున్‌రెడ్డికి చుక్కెదురు
- పుంగనూరుకు రావద్దంటూ కూటమి నేతల ఆందోళనలు
- టీడీపీ వైపు వైసీపీ నేతల చూపు

కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడూ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పుంగనూరు ఎమ్మెల్యేగా ఉన్నారు. మంత్రిగానూ పనిచేశారు. ఆ తర్వాత తెలుగుదేశం అధికారంలోకి వచ్చింది. ఏనాడూ పెద్దిరెడ్డి గో బ్యాక్ అంటూ నినదించలేదు.

మరి.. ఇప్పుడే ఎందుకిలా? వైసీపీ ఐదేళ్ల పాలనలో మితిమీరిన అణచివేత వైఖరే కారణమన్న సమాధానం వినిపిస్తోంది. రాష్ట్రంలో ఎక్కడా లేనన్ని కేసులు ఇక్కడ టీడీపీ, ఇతర పక్షాల నేతలపై నమోదయ్యాయి. ప్రతిపక్షమే లేకుండా చేయాలన్నట్లుగా కక్ష సాధింపు చర్యలకు దిగడం..నిలదీసే ప్రజలపైనా ఉక్కుపాదం మోపడంతో తిరుగుబాటు వచ్చిందని విశ్లేషకులు అంటున్నారు.

మరోవైపు నియోజకవర్గంలో అభివృద్ధి జరగలేదు. పరిశ్రమలకని భూసేకరణ.. శంకుస్థాపనలు తప్ప ఒక్కటీ వచ్చింది లేదు. రిజర్వాయర్ల నిర్మాణం చేపట్టినా రైతులకు పరిహారం ఇవ్వలేదు. ఎన్జీటీ అనుమతులూ లేవు.

ఇలా ఐదేళ్లపాటు పెద్దిరెడ్డి కుటుంబం చెప్పిందే శాసనంలా జరిగింది. ఈ వైఖరే ఇప్పుడు తిరుగుబాటుకు కారణమైందా? పెద్దిరెడ్డి కుటుంబం రాకూడదంటూ నిరసనలకు దిగుతున్నారా? వీరికి షాకుల మీద షాకులు తగులుతున్నాయా?



రోడ్డుపై బైఠాయించిన ఎన్డీయే కూటమి నాయకులు



ధర్నా విరమించాలని సూచిస్తున్న పోలీసులు

అణచివేతే తిరుగుబాటుకు దారితీసిందా?

పుంగనూరు, జూన్ 30: రాజకీయాలు, ప్రభుత్వపాలన, వ్యాపారాలు.. ఐదేళ్లపాటు ఆయా రంగాల్లో ఎదురులేకుండా చెలామణీ అయిన మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబానికి షాకుల మీద షాకులు తగులుతున్నాయి. జగన్ క్యాబినెట్‌లో కీలకంగా పెద్దిరెడ్డి, లోక్‌సభ వైసీపీ పక్షనేతగా మిథున్‌రెడ్డి ఇంతకాలం శాసించారు. ప్రత్యర్థులు ఎదగకుండా ఉక్కుపాదం మోపుతూ, పోలీసు కేసులు పెట్టించారన్న ఆరోపణలున్నాయి. చాలామందిని వైసీపీలో చేర్చుకున్నారు. పెద్దిరెడ్డి రాకతో టీడీపీ బలహీనపడి శ్రేణులు తీవ్ర కష్టనష్టాలను అనుభవించారు. ఈ ఎన్నికల్లో పెద్దిరెడ్డిపై చల్లా రామచంద్రారెడ్డి పోటీ చేసి ఆరువేల ఓట్ల తేడాతో ఓటమిచెందారు. తెలుగుదేశం కూటమి అధికారంలోకి రావడంతో పుంగనూరులో టీడీపీ జెండా రెపరెపలాడింది. పార్టీ శ్రేణులు ఉత్సాహంగా ముందుకు కదులుతున్నారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రతిపక్షాలను అణచివేసిన పెద్దిరెడ్డి, మిథున్‌రెడ్డి ఇప్పుడు సొంత నియోజకవర్గంలో అడుగుపెట్టలేని సంకట పరిస్థితి కనిపిస్తోంది.

ఐదేళ్లు పుంగనూరుకు రావద్దు

'పుంగనూరు ప్రశాంతతను చెడగొట్టకండి. ఐదేళ్లు నియోజకవర్గానికి రావద్దండి' అంటూ కూటమి నేతలు, వైసీపీ బాధితులు నిరసనలకు దిగుతున్నారు. జూన్ 15న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి పుంగనూరుకు వస్తున్నారని ఆందోళనకు దిగడంతో ఆయన పర్యటనను వాయిదా వేసుకున్నారు. ఆదివారం పుంగనూరులో వైసీపీ కార్యకర్తల సమావేశానికి రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి వస్తున్నట్లు తెలిసి టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, శ్రేణులు, బాధితులు అంబేడ్కర్ విగ్రహం ఎదుట రాస్తారోకోకు దిగారు. ప్రశాంతత నాశనం చేసే పెద్దిరెడ్డి కుటుంబం ఐదేళ్లు పుంగనూరుకు రాకూడదని కోరారు. ఇక్కడి అభివృద్ధి సంగతి సీఎం చంద్రబాబు, టీడీపీ ఇన్‌చార్జి చల్లా బాబురెడ్డి చూసుకుంటారన్నారు. ఎన్డీఏ కూటమి పార్టీలే కాకుండా ప్రజలు, వారి బాధితులు పెద్దిరెడ్డి కుటుంబాన్ని పుంగనూరులో అడ్డుకోవడం తథ్యమన్నారు. నిరసనలో అధికశాతం మంది పోలీసు కేసుల బాధితులే కనిపించారు. ఈ ఆందోళనలో నేతలు శ్రీకాంత్, సుబ్రహ్మణ్యంరాజు, సీవీరెడ్డి, పోలీస్‌గిరి, దినేశ్, గంగాధర్, శమీపతి, రామయ్య, చంద్ర, ప్రసాద్, మోహన్‌నాయుడు, కృష్ణానాయక్, నవీన్‌కుమార్, జనసేన నాయకులు పగడాల రమణ, విరూపాక్షి, నరేశ్‌రాయల్, హరినాయక్, బాలాజీనాయక్, చైతన్యరాయల్, బీజేపీ నాయకులు అయూబ్‌ఖాన్, మఠంబాబు, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ఎందుకీ పరిస్థితి : వైసీపీ పాలనలో చంద్రబాబునాయుడు పర్యటన సందర్భంగా పుంగనూరు బైపాస్‌రోడ్డులో పోలీసులు-టీడీపీ వర్గీయుల మధ్య జరిగిన గొడవల్లో 7 ఎఫ్ఐఆర్‌లలో ఏ1గా టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డితో కలిపి 500 మంది టీడీపీ శ్రేణులపై హత్యాయత్నం కేసులు పెట్టి 45 రోజులు జైళ్లకు పంపారు. ఈ కేసుల్లో అనుమానితులుగా దాదాపు రెండు వేల మంది అజ్ఞాతంలో ఉండి తర్వాత వచ్చారు. సంఘటనా స్థలంలో లేనివారిపైనా కేసులు పెట్టారని టీడీపీ వర్గీయులు నాడు ఆరోపించారు. ఇక, చల్లాబాబు పర్యటన సందర్భంగా సోమల మండలం నంజంపేట, సదుం, కల్లూరులో దాడులు, కార్లు ధ్వంసం, రాళ్లు విసరడం, టీడీపీ కార్యక్రమాలను అడ్డుకోవడం, బాధితులపైనే కేసులు పెట్టారు. ఆవులపల్లె ప్రాజెక్టు బాధితులపైనా అనేక కేసులున్నాయి. వైసీపీకి వ్యతిరేకంగా ఉండే దాదాపు 1000 మందిపై హత్యాయత్నం, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదయ్యాయి. రెవెన్యూ అధికారుల ద్వారా భూసమస్యలు, తదితర ఇబ్బందులు పెట్టారు.

టీడీపీ వైపు వైసీపీ నేతల చూపు

తెలుగుదేశం కూటమి అధికారంలోకి రావడంతో పుంగనూరులో వైసీపీ నేతలు పెద్దిరెడ్డిని వదిలి పార్టీ మారడానికి ఎదురుచూస్తున్నారు. నాలుగు రోజుల కిందట పుంగనూరు మున్సిపల్ చైర్మన్ అలీంబాషా, మాజీ వక్ఫ్‌బోర్డు చైర్మన్ రహంతుల్లా (అమ్ము)తోపాటు మొత్తం 11మంది కౌన్సిలర్లు వైసీపీకి రాజీనామాలు చేశారు. టీడీపీలో చేరికపై చల్లా బాబు స్వగృహంలో చర్చించారు. త్వరలో సీఎం చంద్రబాబు సమక్షంలో వారు టీడీపీ కండువా వేసుకోబోతున్నారు. ఇంకా పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు టీడీపీలో చేరడానికి సిద్ధమవుతున్నట్లు సమాచారం.

ప్రజల స్వేచ్ఛకు చర్యలు

వైసీపీ పాలనలో టీడీపీ, ఇతరులపై దౌర్జన్యాలు, రైతుల ఆస్తులకు పరిహారం ఇవ్వకుండా అరాచకాలకు పాల్పడ్డారని టీడీపీ నేతలు ఆరోపించారు. తమ ప్రభుత్వంలో ప్రజలు స్వేచ్ఛగా ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆరడిగుంట, మోదుగులపల్లె వద్ద మూడు ప్యాక్టరీలకు నాటి మంత్రి పెద్దిరెడ్డి శంకుస్థాపనలు చేసినా పురోగతిలేదని గుర్తుచేశారు.

పెద్దిరెడ్డి పాపాల క్యాసెట్ చూసి మాట్లాడు

- ఎంపీ మిథున్‌కు చల్లా సూచన



రొంపిచెర్ల: 'పుంగనూరు నియోజకవర్గంలో టీడీపీ శ్రేణులపై మీ తండ్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేసిన అరాచకాలు, దాష్టీకాలు, పాపాల క్యాసెట్‌ను పంపిస్తా. ఆ దురాగతాలు చూసిన తర్వాత సీఎం చంద్రబాబు, నాపై ఆరోపణలు చేయండి' అని ఎంపీ మిథున్‌రెడ్డికి టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి సూచించారు. . కూటమి విజయం సాధించి చంద్రబాబు నాయుడు సీఎం కావడంతో పుంగనూరు ప్రజలకు స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. వందలాది మందికి పెట్టిన ఇబ్బందుల ఉసురు మీరు అనుభవిస్తున్నారని, చేసిన పాపాలకు దేవుడు శిక్ష విధిస్తారన్నారు. 'ప్రతిపక్షనేతగా, జడ్‌ప్లస్ భద్రతగల చంద్రబాబును ఎమ్మెల్యేగా కుప్పంలో పర్యటించకుండా మీరు అడ్డుకోవడం ధర్మమేనా? జైళ్లకు వెళ్లి నరకం చూసిన బాధితులు మిమ్మల్ని అడ్డుకున్నారు. దీనిని ప్రజాస్వామ్యమా అంటూ దయ్యాలు వేదాలు వల్లించినట్లు మిథున్‌రెడ్డి మాట్లాడటం శోచనీయం. పుంగనూరులో బీజేపీకి ఓట్లు వేయొద్దని ముస్లిం మైనార్టీలను రెచ్చగొట్టి పార్లమెంట్‌లో మాత్రం స్పీకరు ఎన్నికకు మిథున్‌రెడ్డి మద్దతు ఇవ్వడం దారుణం. ఈ మోసపూరిత చర్యలను ప్రజలు గమనిస్తున్నారు' అని చల్లా పేర్కొన్నారు.

'బ్రిటీష్ పాలకుల కంటే పెద్దిరెడ్డి ఇబ్బందులే ఎక్కువ'

బ్రిటీషుపాలకుల కంటే దారుణంగా ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి తమ పార్టీ నాయకులు, కార్యకర్తలపై కేసులు నమోదు చేయించారని టీడీపీ నేతలు మాధవరెడ్డి, సుహేల్‌బాషా పేర్కొన్నారు. వైసీపీ పాలనలో అనవసరంగా కేసులు పెట్టించుకున్న వారు ఎంపీ మిథున్‌రెడ్డి పర్యటనను అడ్డుకోవడానికి తరలివచ్చారన్నారు. టీడీపీ కార్యకర్తలపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు, 307 సెక్షన్లు అక్రమంగా నమోదు చేయడంతో నెలల తరబడి కుటుంబాలను వదిలి జీవించాల్సి వచ్చిందని గుర్తు చేశారు. ప్రతిపక్ష నేతగా కుప్పం పర్యటనకు చంద్రబాబు వస్తే అడ్డుకున్నారని మండిపడ్డారు. టీడీపీ ఇన్‌చార్జి నియోజకవర్గంలో పర్యటించకుండా కేసులు పెట్టించారన్నారు. ఇలా అరాచక పాలన సాగించిన పెద్దిరెడ్డి కుటుంబం ప్రస్తుతం పుంగనూరులో పర్యటించనవసరం లేదని అభిప్రాయపడ్డారు. దొంగ ఓట్లతో గెలిచిన పెద్దిరెడ్డి, మిథున్‌రెడ్డి పుంగనూరుకు రాకుంటేనే ప్రజలు ప్రశాంతంగా నిద్రపోతారన్నారు.

నియోజకవర్గంలో తిరగనివ్వరా?: ఎంపీ



ఎంపీ మిథున్‌రెడ్డితో మాట్లాడుతున్న పోలీసులు

ఆంధ్రజ్యోతి, తిరుపతి: తన నియోజకవర్గ పరిధిలోని పుంగనూరులో తిరగనివ్వరా అంటూ రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ప్రశ్నించారు. తనను హౌస్ అరెస్టు చేయడంపై ఆయన మాట్లాడారు. ఈ విషయాన్ని స్పీకర్ దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. పుంగనూరులో ఎప్పుడూ లేని కొత్త సంస్కృతికి తెరలేపుతున్నారని ఆరోపించారు. జేసీబీలతో పేదల ఇళ్లు కూలదోస్తున్నారు. పుంగనూరుకు ఫ్యాక్షన్ సంస్కృతి పాకిందన్నారు. ఈ గొడవలతో ఎలక్ట్రిక్ బస్సుల యాజమాన్యం సందిగ్ధంలో పడిందన్నారు. తాను బీజేపీకి వెళ్తున్నానని బుద్ధిలేని వారు ప్రచారం చేస్తున్నారన్నారు. చంద్రబాబు ట్రాప్‌లో పడొద్దని చల్లాకు సలహా ఇస్తున్నానని తెలిపారు.

బావిలో పడి తల్లీబిడ్డల మృతి

- వెలికితీసిన ముగ్గురి మృతదేహాలు
- పత్రపల్లెలో విషాదం

సోమల, జూన్ 30: సోమల మండలం ఆవులపల్లె పంచాయతీ పత్రపల్లెలో తల్లీ కూతుళ్లు బావిలో పడి మృతి చెందారు. ఈ విషాద ఘటన ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. పత్రపల్లెకు చెందిన సుబ్రమణ్యం కుమార్తె రాణి (25)కి ఆరేళ్ల కిందట పెద్దపంజాణి మండలం రాయలపేటకు చెందిన విజయకుమార్ తో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు హేమశ్రీ (4), జశ్విక (2) ఉన్నారు. పత్రపల్లెలో జరిగే గంగజాతరకు రాణి తన ఇద్దరు కుమార్తెలతో కలసి శనివారం గ్రామానికి వచ్చారు. ఆదివారం జాతర నేపథ్యంలో పొలాల వద్ద ఉన్న పొలిమేర అమ్మవారి ఆలయం వద్ద పూజలకోసమని గ్రామస్తులతో పాటు కుమార్తెలు హేమశ్రీ, జశ్వికతో కలిసి రాణి వెళ్లారు. అక్కడికి సమీప బావి వద్దకు ఆమె, కుమార్తెలు వెళ్లారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు ఇద్దరు పిల్లలు బావిలో జారి పడిపోయారు. తన ఇద్దరు కుమార్తెలను రక్షించడానికి రాణి ప్రయత్నించి మునిగి పోయారు. ఆమె అరుపులు విని సమీపంలో ఉన్న గ్రామస్తులు అక్కడికి చేరుకున్నారు. వారిని రక్షించడానికి ప్రయత్నించి విఫలమయ్యారు. అనంతరం బావిలో వారి కోసం గాలించి మృతదేహాలను వెలితీశారు. రాణి తండ్రి సుబ్రమణ్యం ఫిర్యాదుతో ఎస్ఐ వెంకట నరసింహులు కేసు నమోదు చేశారు. ముగ్గురి మృతదేహాలను పోస్టు మార్టం నిమిత్తం పుంగనూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



బయటకు తీసిన మృతదేహాలు

నేడు జిల్లాలో పింఛన్ల పండగ

- ఉదయం 6 గంటల నుంచి పంపిణీ
- 2.71 లక్షల మందికి ఇళ్ల వద్దే పెన్షన్ అందిస్తామన్న కలెక్టర్

చిత్తూరు (సెంట్రల్), జూన్ 30: జిల్లాలో సోమవారం పండగ వాతావరణంలో పింఛన్ల పంపిణీ జరగనుంది. అధికారంలోకి వచ్చిన వెంటనే ఒకేసారి పెంచిన రూ.వెయ్యితో కలిపి రూ.4 వేలు, మూడు నెలల బకాయిలు రూ.మూడు వేలు.. వెరసి రూ.ఏడు వేలను అందించనున్నారు. జిల్లాలోని 2,71,696 మందికి రూ.181.02 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ మొత్తం జగన్ ప్రభుత్వంలో రూ.79.66 కోట్లు ఉండింది. వృద్ధులు, వితంతువులు, చేనేత, ఒంటి మహిళ, కల్లుగీత కార్మికులు, డప్పు కళాకారులు, హెచ్ఐవీ బాధితులు, హిజ్రాలు, కళాకారులు నెలకు మూడు వేల రూపాయల నుంచి రూ.4 వేలకు పెరగడంతో మూడు నెలల అరియర్స్ కలుపుకుని రూ.7 వేలు అందజేయనున్నారు. దివ్యాంగులు, కుష్ఠు, వైకల్యం ఉన్నవారికి రూ.3 వేల నుంచి రూ.6 వేలు ఇవ్వనున్నారు. కిడ్నీ, కాలేయం, గుండె మార్పిడి, డయాలసిస్ ఇదితర కేటగిరిల వారికి రూ.5 వేల నుంచి రూ.10 వేలు ఇవ్వనున్నారు. పక్షవాతంతో మంచానికే పరిమితమైన వారికి రూ.5 వేల నుంచి ఏకంగా రూ.15 వేలు ఇవ్వనున్నారు. పెంచిన సామాజిక పింఛన్లను సోమవారమే పండుగ వాతావరణంలో పంపిణీ చేస్తామని, ఎక్కడైనా అనివార్య కారణాలతో ఆగితే మంగళవారం అందజేస్తామని కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. జిల్లాలోని 2,71,696 మందికి రూ.181 కోట్లను సోమవారం ఉదయం 6 గంటల నుంచి గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ద్వారా ఇళ్ల వద్దే పంపిణీ చేస్తామన్నారు. కాగా, జిల్లాస్థాయిలో పూతలపట్టు మండలం పేటమిట్టలో సోమవారం ఉదయం 7 గంటలకు జరిగే పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో కలెక్టరు సుమిత్‌కుమార్ పాల్గొననున్నారు.

సకల సమస్యలూ ముంచెత్తినపుడు కనిపించని దేవుడ్ని నమ్ముకుని మనసు కుదుటపరచుకుంటాం. అనారోగ్యం ముట్టడించి ఆందోళనపరచినపుడు కనిపించే వైద్యుల మీద భారం వేసి చేతులు జోడిస్తాం. గంభీరంగా కనిపించే డాక్టర్ల తెల్లకోటు వెనుక నిరంతరం ఒక కల్లోలం సుడులు తిరుగుతూ ఉంటుంది. ప్రతి క్షణం ఒక సవాలే. ప్రతి రోగీ ఒక పాఠమే. ముఖ్యంగా అరకొర వసతుల ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉప్పెనలా వచ్చిపడే కేసుల నడుమ ప్రతి డాక్టర్ చేసేది వైద్యావధానమే. మతం చూడరు. కులం చూడరు. రోగి స్తోమత చూడరు. ప్రతి ప్రాణం కాపాడడమే లక్ష్యంగా పనిచేస్తారు. చదువుకున్న శాస్త్రానికి కూడా ఒక్కోసారి రోగం అర్థం కాదు. పరిస్థితి విషమించిన విపత్కర సమయంలో తీసుకునే నిర్ణయం కీలకమైనది. అది అన్నిసార్లూ ఉద్యోగ నియమాలకు లోబడి ఉండదు. మందులతో కాక మనసుతో వైద్యం చేయాల్సిన సందర్భాలే ఎక్కువగా ఉంటాయి. రోగి బంధువుల ఆగ్రహావేశాలకూ బలికావలసి ఉంటుంది. అటువంటి విషమ సమయాలను ఎదుర్కొన్న ప్రసిద్ధ డాక్టర్ల అనుభవాల సమాహారమే ఇది.

తిరుపతి ఆంధ్రజ్యోతి



కనిపించే దేవుళ్లకు వందనం

ఎదుర్కొన్న విషమ సందర్భాలపై ప్రసిద్ధ వైద్య నిపుణుల జ్ఞాపకానుభవాలు



డాక్టర్ గణపతి సుబ్రమణ్యం
సీనియర్ కార్డియోథొరాసిక్ సర్జన్

తిరుపతిలో కూడా గుండె మార్పిడి శస్త్రచికిత్సలు జరుగుతున్నాయి. ప్రత్యేక విమానాల్లో గుండెను తీసుకువచ్చి అవసరమైనవారికి శ్రీపద్మావతి చిన్నపిల్లల హృదయాలయ ఆస్పత్రిలో అమరుస్తున్నారు. ఈ అద్భుతం చేస్తున్నవారిలో ముఖ్యులు డాక్టర్ గణపతి సుబ్రమణ్యం. సీనియర్ కార్డియో థొరాసిక్ సర్జన్. వైద్య రంగంలో పాతికేళ్లకు పైగా అనుభవం. ఢిల్లీ ఎయిమ్స్‌లో ఎంసీహెచ్ (కార్డియోథొరాసిక్ సర్జరీ) చేసిన ఆయన ఆస్ట్రేలియా, చెన్నైల్లో గుండె మార్పిడి శస్త్రచికిత్సపై అధ్యయనం చేశారు. అనుభవం సంపాదించారు. అపోలో ఆస్పత్రిలో పనిచేస్తూ, 2021లో శ్రీపద్మావతి చిన్నపిల్లల హృదయాలయ ఆస్పత్రికి వచ్చారు. సీనియర్ సీటీ సర్జన్‌గా తిరుపతిలో గుండె మార్పిడి ఆపరేషన్లు చేస్తూ, పిల్లల గుండె జబ్బులకు చికిత్స అందిస్తున్నారు.

గుండె మార్చడమా మానడమా..

"ఆ పిల్లాడికి 15ఏళ్లుంటుంది. గుండె జబ్బుతో శ్రీపద్మావతి హృదయాలయ ఆస్పత్రికి వచ్చాడు. పరీక్షలు చేశాం. గుండె పంపింగ్ ఛాంబర్‌లో రక్తపు గడ్డలున్నట్టు గుర్తించాం. గుండె జబ్బులున్నవారిలో ఇది చాలా అరుదు. కృత్రిమ పరికరం కూడా పెట్టలేని పరిస్థితి. దీనికి గుండె మార్పిడి ఒక్కటే మార్గం. సరిగ్గా అప్పుడే బ్రెయిన్ డెడ్ వ్యక్తికి సంబంధించిన డోనర్ అలర్ట్ వచ్చింది. అదృష్టవశాత్తూ మార్పిడి కోసం గుండె దొరికే అవకాశం ఉంది. ఆ పిల్లాడికి గుండె మార్పిడి చేయాలని నిర్ణయించుకున్నాం. అయితే వాళ్లది చాలా పేద కుటుంబం. గుండె మార్పిడి తర్వాత కూడా చాల ఖర్చు అవుతుంది. క్రమం తప్పకుండా డాక్టర్‌ను కలుస్తూ, మందులు వేసుకుంటుండాలి. అలా చేస్తారో లేదోనన్న అనుమానం కలిగింది. తగిన అవగాహన కల్పిద్దామనుకుని ఆపరేషన్‌కు సిద్ధపడ్డాం. అన్ని పరీక్షలూ చేసిన తర్వాత ఊపిరితిత్తుల్లో ఫ్లూయిడ్ ఉన్నట్టు గుర్తించాం. గుండె పనితీరు విఫలమైన రోగుల్లో ఇది సాధారణమే. అందుకే ఆపరేషన్‌కు అన్నీ సిద్ధం చేసుకున్నాం. అయితే అది ఫ్లూయిడ్ కాదని, కుడివైపు ఉన్న లంగ్‌కు ఇన్‌ఫెక్షన్ అని తేలింది. లంగ్ ఇన్‌ఫెక్షన్ ఉంటే గుండె మార్పిడి చేయకూడదు. మెత్తగా ఉండాల్సిన లంగ్ గట్టిగా మారిపోయి ఉంది. గుండె మార్పిడి తర్వాత ఇచ్చే డ్రగ్స్ వలన ఊపిరిత్తులు ఇంకా ప్రమాదకర పరిస్థితికి వెళ్లొచ్చు. ఇటువంటి స్థితిలో ఏం చేయాలి? ఇంతలో డోనర్ హార్ట్ వచ్చేసింది. వేరే దారిలేదు. గుండె మార్చకపోయినా ప్రాణానికి ప్రమాదమే. అందుకే ముందుకు వెళ్లాలనే నిర్ణయించుకున్నాం. ఆపరేషన్ చేసేశాం. ఇన్‌ఫెక్షన్ మరింత ఎక్కువై లైఫ్ రిస్క్ అయ్యే అవకాశం ఉంది. పల్మనాలజిస్ట్ ఓపీనియన్‌తో పోస్ట్ ఆపరేటివ్ కేర్ తీసుకున్నాం. వైద్యశాస్త్రంలో కూడా కొన్నిసార్లు అద్భుతాలు జరుగుతాయి. అదృష్టవశాత్తూ క్రమంగా ఆపిల్లాడికి లంగ్ ఇన్‌ఫెక్షన్ తగ్గింది. గుండె మార్పిడి చేసుకున్న అతను ఇప్పుడు ఆరోగ్యంగా ఉన్నాడు. రెగ్యులర్‌గా చెకప్‌కి వస్తున్నాడు. మందులు వేసుకుంటూ ఎంతో ఉత్సాహంగా కనిపిస్తున్నాడు. ఆ పిల్లాడి మొహంలో కనిపించే వెలుగు చాలదా ఒక డాక్టర్‌గా జీవితాంతం తృప్తి పడడానికి. స్విమ్స్ డాక్టర్ అల్లాడి మోహన్ ఒకసారి అన్నమాట గుర్తుకువస్తుంటుంది. 'ఇక్కడ ఒక్కోసారి అల్లోపతి, హోమియోపతి కన్నా కొండపై ఉన్న వెంకటాచలపతి వైద్యం పనిచేస్తుంటుంది' అని ఆస్పత్రిలోని వెంకన్న ఫొటోవైపు చూస్తూ చెప్పారు. నిజమే కదా!"



డాక్టర్ పీజే నాయుడు
ఆస్టర్ నారాయణాద్రి ఆస్పత్రి

కొవిడ్ గడగడలాడించిన కాలంలో ఎందరికో ఆపద్బాంధవుడిగా నిలిచిన డాక్టర్.. పీజే నాయుడు. ఆస్టర్ నారాయణాద్రిలో సీనియర్ జనరల్ కన్సల్టెంట్‌గా ఉన్నారు. కరోనా కల్లోలం సృష్టిస్తున్న రోజుల్లో వైద్యుడిగా ఆయన అందించిన సేవలు మరిచిపోలేనివి. రోజుకు 12గంటలకు పైగా పీపీఈ కిట్ ధరించి కొవిడ్ వార్డుల్లోనే గడిపారు. సహచర వైద్యులకూ, సిబ్బందికీ ధైర్యం చెబుతూ, భరోసానిస్తూ రోగులకు సేవలందించారు. ఒక యోధుడిలా కొవిడ్‌పై యుద్ధం చేశారు.

12గంటలూ పీపీఈ సూట్‌లో..

"కొవిడ్ పీరియడ్ నా కెరీర్‌లో అతిక్లిష్టమైన సమయం. నేను వైద్యం చేసిన ప్రతి బాధితుడూ నాకొక జ్ఞాపకమే. కొవిడ్ అంటే అందరూ భయపడుతున్న రోజుల్లో పీపీఈ కిట్ ధరించి ఉదయం ఏడు నుంచి రాత్రి 10 గంటల వరకు నిరంతరాయంగా పనిచేయాల్సి వచ్చింది. ఆ సమయంలో సన్నిహితులు, సహచర వైద్యులు కూడా కొవిడ్‌తో అడ్మిట్ అవుతున్నారు. వారిని వెంటిలేటర్ మీద ప్రమాదకర పరిస్థితుల్లో చూస్తుంటే గుండె తరుక్కుపోయేది. వైద్యుడిగా ఆ పరిస్థితి నన్ను బలహీనపరచుకుండా చూసుకోవడం అన్నింటికన్నా పెద్ద సవాలుగా మారింది. అదొక యుద్ధ క్షేత్రం. వెనుతిరిగే సమయమూ లేదు. అవకాశమూ ఉండదు. కనిపించని క్రిమితో ప్రాణాలకు వెరవకుండా యుద్ధం చేయడమే. వెనుదిరగలేదు. ప్రతి కేసూ భిన్నమైనదే. పుస్తకాల చదువుకు అనుభవాన్ని జోడించి వైద్యం చేయాలి. ఊపిరాడని స్థితిలో వచ్చి చేరే బాధితులు.. వాళ్ల కోసం బంధుమిత్రుల ఆందోళనతో కూడిన ఒత్తిళ్లు, వీఐపీల ఫోన్లు... కొవిడ్ కాలంలో దాదాపు పదివేల మంది బాధితులకు వైద్యసేవలు అందించి ఉంటా. ఒక వైద్యుడిగా బహుశా జీవితకాలంలో దక్కే అనుభవాలను కొవిడ్.. ఏడాదిలో నాకు ఇచ్చింది. ప్రాణాలొడ్డి చేసిన ఆ పోరాటం వృథా కాలేదు. ఇప్పటికీ నన్ను చాలామంది గుర్తుపట్టి చేతులు జోడించి పకలరిస్తూ ఉంటారు. 'మీరు మా ఇంట్లోవాళ్లకు కొవిడ్‌లో వైద్యం చేశారు. దేవుడు సర్' అంటుంటారు. ఆ తర్వాత నన్ను ఒక మాట అడుగుతుంటారు. 'కొవిడ్‌లో భయపడకుండా ఎలా ఉన్నారు?' అని. వారికి నేను చెప్పే సమాధానం ఒక్కటే.. 'నేను స్వామి సన్నిధిలో సేవ చేస్తున్నా. నన్ను ఆయనే చూసుకుంటారు' అని. అదే జరిగింది."



డాక్టర్ పెన్నా కృష్ణప్రశాంతి
సీనియర్ ఫిజీషియన్

వైద్యరంగంలో పరిచయం అక్కర్లేని పేరు డాక్టర్ పెన్నా కృష్ణప్రశాంతి. ఆరోగ్యపరంగా జిల్లాకు ఏ కష్టం వచ్చినా యంత్రాంగానికి వెంటనే ఆమె గుర్తుకొస్తారు. కొవిడ్ విపత్తులో ప్రతినిత్యం ఇటు మాధ్యమాల ద్వారా, అటు కొవిడ్ వార్ కమిటీలోనూ చురుకైన పాత్ర పోషించారు. వైద్యానికి మానవీయతను జోడించిన అరుదైన వైద్యురాలు. ప్రభుత్వ పాఠశాలల్లోని బాలబాలికలకు శారీరక అవగాహన కల్పిస్తుంటారు. షుగర్ వ్యాధి ప్రభావాల మీద విశేష అధ్యయనం చేశారు. అనేక దేశాల వైద్య సెమినార్లలో పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ 'బైరాక్' (బయోటెక్నాలజీ ఇండస్ట్రీ రీసెర్చ్ అసిస్టెన్స్ కౌన్సిల్) ఇండిపెండెంట్ డైరెక్టర్. తెలుగు రాష్ట్రాల నుంచి 'బైరాక్'కు ఎంపికైన తొలి ప్రతినిధిగా చరిత్ర సృష్టించి తిరుపతి ప్రైడ్‌గా నిలిచారు.

భారతి నేర్పిన పాఠం

"నేను రుయాలో పనిచేస్తున్న రోజులు అవి. సూళ్లూరుపేట ప్రాంతం నుంచి భారతి అనే అమ్మాయి తీవ్ర రక్తహీనతతో వచ్చింది. ఏప్లాస్టిక్ అనీమియా. రక్తహీనతతో పాటూ ప్లేట్‌లెట్‌లు తగ్గిపోయి ఆమె శారీరక స్థితి దారుణంగా ఉంది. అప్పట్లో తిరుపతిలో హెమటాలజీ కూడా లేదు. తగిన పరీక్షలు చేయించుకోవడానికి వాళ్ల దగ్గర డబ్బులులేవు. కూలి చేస్తే తప్ప కూడులేని కుటుంబానికి ఆ పిల్లకి వైద్యం చేయించడం అసాధ్యం. పెద్ద ఆస్పత్రులకు వెళ్లలేరు. ప్రభుత్వ ఆస్పత్రి కాబట్టి రుయాకి వచ్చారు. తక్షణం పరీక్షలు చేయించాలి. వెంటనే వైద్యం మొదలు పెట్టాలి. వాళ్ల నాన్న వైద్యం చేయించలేమని చేతులెత్తేశాడు. టీనేజ్‌లోకి ప్రవేశిస్తున్న ఆ పాపను చూస్తే గుండె తరుక్కుపోతోంది. అలా వదిలేయలేకపోయాను. నా జీతం అప్పుడు రూ.6,500. ఆనెల జీతంలోనుంచి వెయ్యి రూపాయలు ఇచ్చి వైద్య పరీక్షలు చేయించాను. రుయాలో అడ్మిట్ చేయించాను. ఆ అమ్మాయి పరిస్థితిని వివరిస్తూ సాయం కోసం మీడియాలో కథనాలు వచ్చేలా చేశాను. ఎందరో దాతలు ముందుకొచ్చారు. అప్పటి ఎంపీ డాక్టర్ చింతామోహన్‌కి చెప్పి ఎంపీ నిధుల నుంచి రూ.12వేలు ఇప్పించాను. ఆతర్వాత వేలూరు సీఎంసీ ఆస్పత్రికి రెఫర్ చేశాం. వైద్యం కొనసాగింది. జీవితం మీద ఆశ పెంచుతూ ఆ పాపతో తరచూ మాట్లాడిన మాటలు చాలా పనిచేశాయి. ఆమెతో ఆత్మవిశ్వాసం పెరిగింది. బేలగా, బలహీనంగా ఆస్పత్రికి వచ్చిన అమ్మాయి దృఢంగా మారింది. క్రమంగా కోలుకుంది. ప్రాణాలతో తిరిగి రాదు అనుకున్న ఆ అమ్మాయి ఆరోగ్యంగా తిరిగి ఊరికి వెళ్లింది. చదువు కొనసాగించింది. అందుకు గ్రామస్తులు, టీచర్లు సహకరించారు. బీఎడ్ పూర్తిచేసింది. ఉద్యోగం సంపాదించింది. పెళ్లి కూడా చేసుకుంది. నేనూ వెళ్లాను. గలగలా మాట్లాడుతూ ఒక ఉత్సవంలా కనిపిస్తున్న భారతిని చూసినపుడు డాక్టర్‌గా కలిగిన ఆనందం వర్ణించలేనిది. ఆమెకు నేను చేసిన సాయం వెయ్యి రూపాయలు మాత్రమే. కానీ అవసర సమయంలో చేసిన ఆ వెయ్యి, ఇంకెన్నో వేలు వచ్చేలా దారి వేసింది. ఆమె ప్రాణాలు నిలిపింది. ఒక డాక్టర్, తమ దగ్గరకు వచ్చినవారి రోగాన్ని మాత్రమే చూస్తే సరిపోదు. మందులు మాత్రమే పరిష్కారం కాదు. వాళ్ల సామాజిక, ఆర్థిక పరిస్థితులు గమనించి చెప్పే మాటలు, ఇచ్చే ధైర్యం, భరోసా, సరైన సమయంలో చేసే సహాయం ఒక కుటుంబాన్నే నిలబెడతాయి అనే పాఠం భారతి సంఘటన నుంచి నేను నేర్చుకున్నాను."



డాక్టర్ పార్థసారథిరెడ్డి
సీనియర్ గైనకాలజిస్ట్

సాధారణంగా పురుష వైద్యులు గైనకాలజీ కోర్సును పెద్దగా ఎంచుకోరు. డాక్టర్ పార్థసారథిరెడ్డి మాత్రం గైనకాలజీ చేసి, నిపుణుడైన వైద్యుడిగా తిరుపతి నగరంలో పేరుపొందారు. ప్రస్తుతం ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా ఉన్నారు. పాతికేళ్లకు పైగా అనుభవం. పేదలు ఆయన్ని వెతుక్కుంటూ వస్తారు. ప్రసూతి ఆస్పత్రిలో ఆయన ఓపీకి చాలా డిమాండు. సాయంత్రం వేళ ఓ ప్రైవేట్ ఆస్పత్రిలోనూ సేవలందిస్తారు. తక్కువ ఖర్చుతో కాన్పులు చేస్తారు. అనవసర సిజేరియన్‌లను ప్రోత్సహించరు.

అర్ధరాత్రి యుద్ధం

"పదేళ్ల కిందట.. గర్భంతో ఉందంటూ ఒక మహిళను తిరుపతిలోని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రికి తీసుకువచ్చారు. ఆమెది వెంకటగిరి. ఆపరేషన్ చేసి బిడ్డను తీయమన్నారు. కడుపు నొప్పితో ఆమె మెలికలు తిరిగిపోతోంది. స్కానింగ్ చేశాం. ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీగా ప్రాథమిక అంచనాకు వచ్చాం. అత్యవసరంగా ఆపరేషన్ చేయాలని నిర్ణయించాం. రాత్రి 10 గంటలకు ఆపరేషన్ మొదలుపెట్టాం. సిజేరియన్ కోసం పొట్ట దగ్గర కట్ చేసి చేయిపెట్టగానే పెద్ద రక్తనాళంలో గడ్డ పగిలిపోయి, విపరీతమైన రక్తస్రావం జరిగింది. గుండెనుంచి వచ్చే ధమనిలో (కిడ్నీల సమీపంలో) పెద్దగడ్డ (ఇలియాక్ ఆర్టరీ ఎన్యూరిజమ్) పెరిగి ఉంది. నిజానికి గర్భాశయంలో బిడ్డ లేదు. ఆపరేషన్ ప్రక్రియ మొదలుపెట్టగానే గడ్డ పగిలిపోయింది. విపత్కర పరిస్థితి. వెంటనే రుయానుంచి యూరాలజిస్ట్ డాక్టర్ రమేష్, సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ భారతిని పిలిపించాం. ఈలోగానే ఆమెకు మూడు సార్లు కార్డియాక్ అరెస్టు వచ్చింది. పరిస్థితి వివరించగానే స్విమ్స్‌నుంచి ప్రముఖ కార్డియోథొరాసిక్ సర్జన్ డాక్టర్ అబాచంద్రన్ వచ్చారు. ఆపరేషన్ కొనసాగింది. రాత్రి పది గంటలకు మొదలైన ఆపరేషన్ పూర్తయ్యేసరికి తెల్లవారుజాము 4గంటలైంది. విజయవంతంగా రక్తనాళాన్ని సరిచేశాం. అయితే ఆమెకు వెంటిలేటర్ సహాయం కావాలి. స్విమ్స్‌కు తీసుకువెళ్లాలి. మధ్యలో ఏం జరుగుతుందో తెలీదు. నేనే దగ్గరుండి తీసుకెళ్లా. అక్కడ రూ.3వేలు అడ్వాన్స్ కట్టమన్నారు. రోగి సహాయకుల దగ్గర డబ్బులు లేవు. నా దగ్గర ఉన్న డబ్బులు కట్టేసి అడ్మిట్ చేశా. ఆ అర్ధరాత్రి ఒక యుద్ధంలా సాగింది. ప్రతి క్షణం టెన్షన్‌తో గడిచింది. సమయానికి అందరు డాక్టర్లూ వచ్చి సహకరించారు. ప్రభుత్వ ఆస్పత్రుల గురించి చులకనగా మాట్లాడేవాళ్లకు ఇటువంటివి అర్థమైతే బావుండును. రెండు రోజులకే ఆమె కోలుకున్నారు. డిశ్చార్జ్ అయ్యి ఇంటికి వెళుతూ నా దగ్గరకొచ్చి చేతులు జోడించిన ఆమె కళ్లలో తొణికిసలాడిన నీటి పొరను చూసి నాకళ్లు కూడా చెమ్మబారాయి.. అయితే ఆ ప్రాణాన్ని కాపాడగలిగాము కదా అనే ఆనందంతో."

మూడో తేదీ వరకు తోతాపురి కేజీ రూ.24



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 30: జిల్లాలో ఈనెల మూడో తేదీ వరకు మామిడి ధర కిలో రూ.24కు తగ్గకుండా ఉంటుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. ఆదివారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో మామిడి ధరలపై రైతులు, గుజ్జు పారిశ్రామికవేత్తలతో ఆయన సమావేశమయ్యారు. తోతాపురి మామిడికి గతంలో కేజీ రూ.30 గిట్టుబాటు ధర నిర్ణయించామని గుర్తు చేశారు. రైతులు, గుజ్జుపారిశ్రామికవేత్తల అభిప్రాయాలను స్వీకరించిన తర్వాత బుధవారం వరకు రూ.24కు తగ్గకుండా ధర కొనసాగించాలని నిర్ణయించామన్నారు. బుధవారం మరోసారి సమావేశమై ధర పెంపుదలపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. రైతులు నేరుగా మామిడిని గుజ్జు పరిశ్రమల యూనిట్ వద్దకు తీసుకెళ్లాలన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి, గుజ్జు పరిశ్రమల సంఘ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

చిత్తూరు, జూన్30: కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక జరుగుతుందని కలెక్టర్ సుమిత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తామన్నారు.జిల్లా అధికారులు తప్పక హాజరుకావాలని కోరారు.

- ఎస్పీ కార్యాలయంలోనూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక జరుగుతుందని ఎస్పీ మణికంఠ ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసు శాఖకు సంబంధించి సమస్యలుంటే నేరుగా కలిసి వివరించాలని కోరారు.

200 సెల్‌ఫోన్ల రికవరీ



రికవరీ చేసిన మొబైల్ ఫోన్లను చూపిస్తున్న ఎస్పీ మణికంఠ చందోలు

చిత్తూరు, జూన్ 30: జిల్లాలో చోరీకి గురైన రూ.45 లక్షల విలువ చేసే 200 ఫోన్లను పోలీసులు రికవరీ చేశారు. ఆ వివరాలను ఆదివారం ఎస్పీ మణికంఠ పోలీసు అతిథి గృహంలో మీడియాకు వివరించారు. పోగొట్టుకున్న ఫోన్లను చిత్తూరు పోలీసు చాట్‌బాట్ ప్రత్యేక యాప్ ద్వారా తిరిగి పొందవచ్చునన్నారు. ఆరు దశల్లో ఇప్పటి వరకు రూ.3.60 కోట్ల విలువ చేసే 1,700 ఫోన్లను రికవరీ చేసినట్లు వెల్లడించారు. ఆరో దశలో 200 ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందించినట్లు చెప్పారు. చోరీకి గురైన ఫోన్లు ఏ రాష్ట్రంలో ఉన్నా ఈ యాప్ ద్వారా రికవరీ చేయవచ్చునని వివరించారు. ఈ కార్యక్రమంలో క్రైమ్ బ్రాంచ్ సీఐ రామాంజినేయులు, చాట్‌బాట్ సిబ్బంది బాషాజీ, శ్రీనివాసన్ తదితరులు పాల్గొన్నారు.

చాట్‌బాట్‌కు పంపాల్సిన విధానం

మొబైల్‌ఫోన్ పోగొట్టుకున్న వారు ముందుగా 94409 00004కు వాట్సాప్ ద్వారా హాయ్ లేదా హెల్ప్ అని మెసేజ్ పంపాలి. వెంటనే వెల్‌కం ఇన్ చిత్తూరు పోలీసు పేరున లింకు వస్తుంది. గూగుల్ ఫార్మెట్ ఓపెన్ అవుతుంది. వివరాలను పూరించాలి. సబ్మిట్ చేస్తే కంప్లయింట్ నమోదవుతుంది.

పోలవరం, అమరావతికి విజయనగరం ఎంపీ తొలి జీతం

తిరుమల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): తన మొదటి నెల జీతం అమరావతి అభివృద్ధి, పోలవరం నిర్మాణం కోసం ఇవ్వాలని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు నిర్ణయించుకున్నారు. తిరుమల శ్రీవారిని ఆదివారం దర్శించుకున్న ఆయన స్వామి సన్నిధిలో ఈ నిర్ణయం తీసుకున్నారు. తన తొలి జీతాన్ని సీఎం చంద్రబాబుకు అందించనున్నారు. రాష్ట్రానికి రెండు కళ్లుగా ఉన్న రాజధాని, పోలవరం నిర్మాణానికి సీఎం పూనుకున్నారని, ఆయనకు అండగా ఉండేందుకు ఉమ్మడి తెలుగు రాష్ట్రాలతోపాటు విదేశాల్లో ఉంటున్న ఎన్‌ఆర్‌ఐలు సైతం తమ వంతుగా విరాళాలు ఇచ్చి మద్దతుగా నిలవాలని అప్పలనాయుడు ఒక ప్రకటనలో కోరారు. ఈనాడు సంస్థ అధినేత రామోజీరావు తనకు ఆదర్శమన్నారు. పోలవరం, రాజధాని అమరావతి రెండు ప్రాజెక్టులు అభివృద్ధి చెందాలని, ఏపీని ప్రగతిపథంలో నడిపించేందుకు సీఎం చంద్రబాబుకు ఆశీస్సులు ఇవ్వాలని శ్రీవారిని వేడుకున్నట్టు తెలిపారు.



శ్రీవారి ఆలయం ముందు కలిశెట్టి అప్పలనాయుడు

ఎర్రజెండా నీడన నా అనుభవాలు పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణలో పాల్గొన్న నేతలు తదితరులు

తిరుపతి (కల్చరల్), జూన్ 30: ప్రముఖ వామపక్ష నాయకుడు ఏవీ వర్మ రచించిన ఎర్రజెండా నీడన నా అనుభవాలు పుస్తకావిష్కరణ సభ ఆదివారం స్థానిక యశోదానగర్ లోని వేమన విజ్ఞాన కేంద్రం హాలులో జరిగింది. పుస్తకాన్ని రాజ్యసభ మాజీ సభ్యుడు పెనుమల్లి మధు ఆవిష్కరించారు. కాగా తపాలా శాఖలో విధినిర్వహణ చేస్తూ అనేక సామాజిక సమస్యలను ప్రజా పోరాటాల ద్వారా పాలక వర్గాల దృష్టికి తీసుకువెళ్లి, పరిష్కరించడంలో ఏవీ వర్మ సాగించిన పోరాటం, వామపక్ష అభిమానిగా ఆయన నిబద్ధత, కృషి, ఉమ్మడి జిల్లాలో వామపక్షపార్టీ భావజాలం వ్యాప్తిలో పాత్రను వక్తలు ప్రస్తుతించారు. డబ్బు, సంపద లేకపోయినా ప్రజలకోసం జీవించడం ఎలాగో వర్మ ఆచరించి చూపారని, పుస్తకంలో అటువంటి అనేక అనుభవాలను ఆయన పేర్కొన్నారని తెలిపారు. సీనియర్ పాత్రికేయులు ఆలూరి రాఘవ పుస్తక సమీక్ష చేశారు. ముఖ్యఅతిథులుగా సీఐటీయూ రాష్ట్రప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, అంజయ్య, సీపీఎం జిల్లా కార్యదర్శి నాగరాజు, సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి, ప్రముఖ వైద్యులు డాక్టర్ మునస్వామి, గుంటూరు జిల్లా వామపక్ష నేత నిమ్మగడ్డ నాగేశ్వరరావు, కందారపు మురళి తదితరులు వేదికపై ప్రసంగించారు. వేమన విజ్ఞానకేంద్రం కార్యదర్శి మల్లారపు నాగార్జున, ఓవి.రమణ, తోటవెంకటేశ్వర్లు, దామోదరం, వామపక్షపార్టీల సభ్యులు, రచయిత వర్మ కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

నేటినుంచి తిరుపతి-కాట్పాడి మెము రైళ్ల రద్దు

పెరంబూర్, జూన్ 30: దక్షిణ మధ్య రైల్వే గుంతకల్ డివిజన్‌లోని పలు మార్గాల్లో ట్రాక్ మరమ్మతుల కారణంగా జూలై ఒకటి నుంచి 31వ తేదీ వరకు పలు మెము రైళ్లు రద్దు చేసినట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది.

- తిరుపతి నుంచి ఉదయం 6.50 గంటలకు బయలుదేరే తిరుపతి - కాట్పాడి మెము స్పెషల్ ఎక్స్‌ప్రెస్ (నెం 07659), రాత్రి 9.15 గంటలకు కాట్పాడి నుంచి బయలుదేరే కాట్పాడి - తిరుపతి మెము స్పెషల్ ఎక్స్‌ప్రెస్ (నెం.07582) నెలరోజులు రద్దవుతాయి.

ఇదే విధంగా కాట్పాడి నుంచి ఉదయం 9.30 గంటలకు బయలుదేరే కాట్పాడి - జోలార్‌పేట మెము స్పెషల్ ఎక్స్‌ప్రెస్ (నెం.06417), మధ్యాహ్నం 12.45 గంటలకు జోలార్‌పేట నుంచి బయలుదేరే జోలార్‌పేట - కాట్పాడి మెము ఎక్స్‌ప్రెస్ (06418) రైలు నెల రోజులు రద్దు చేశారు.

పాక్షిక రద్దు...

తిరుపతి నుంచి మధ్యాహ్నం 1.40 గంటలకు బయలుదేరే తిరుపతి - విల్లుపురం ఎక్స్‌ప్రెస్ రైలు (నెం.16853) తిరుపతి - కాట్పాడి మధ్య జూలై ఒకటి నుంచి నెలరోజులపాటు పాక్షికంగా రద్దు చేస్తున్నారు. అలాగే విల్లుపురం నుంచి ఉదయం 5.35 గంటలకు బయలుదేరే విల్లుపురం - తిరుపతి ఎక్స్‌ప్రెస్ (నెం.16854) కాట్పాడి - తిరుపతి మధ్య నెలరోజులు పాక్షికంగా రద్దు చేస్తున్నారు.



ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ

శ్రీకాళహస్తి, జూన్ 30: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వారాంతపు సెలవులు కావడంతో తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. సుమారు 25వేల మంది స్వామి అమ్మవార్లను దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. అలాగే పెద్దసంఖ్యలో భక్తులు రాహుకేతు పూజలు చేయించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు.

గంగమ్మ నామ స్మరణతో మార్మోగిన బోయకొండ



చౌడేపల్లి, జూన్ 30: బోయకొండ గంగమ్మ ఆలయం భక్తుల గంగమ్మ నామ స్మరణతో మార్మోగింది. ఆదివారం ఆలయ అర్చకులు అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి స్వర్ణాభరణాలు పూలతో అలంకరించారు. ధూపదీప నైవేద్యాలు సమర్పించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ముక్కంటి ఆలయ ఈవోగా మూర్తి



శ్రీకాళహస్తి, జూన్ 30: శ్రీకాళహస్తీశ్వరాలయ ఈవోగా తిరుపతి దేవదాయశాఖ ఆర్జేసీగా పనిచేస్తున్న ఎస్‌వీఎస్ఎన్ మూర్తి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. అంతకు ముందు ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికారు. ముందుగా ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం గురుదక్షిణామూర్తి సన్నిధి వద్ద ఆలయ వేదపండితులు ఆశీర్వదించారు.అనంతరం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఈవోగా పనిచేస్తున్న ఎస్వీ నాగేశ్వరరావు ఆదివారం పదవీ విరమణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు ఏకాంబరం, మల్లికార్జునప్రసాద్, సతీష్‌మాలిక్, నాగభూషణం యాదవ్, హరియాదవ్ పాల్గొన్నారు.

తరలిపోయిన సర్వీసులు తిరిగి తెచ్చుకొందాం



ఆర్టీసీ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

పలమనేరు, జూన్ 30 : పలమనేరు ఆర్టీసీ డిపో నుంచి తరలి పోయిన బస్సులను తిరిగి తీసుకొచ్చేందుకు అధికారులు కృషిచే యాలని, అందుకు తనవంతు సహకరి స్తానని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పేర్కొ న్నారు. ఆదివారం అయన తన కార్యాలయంలో పలమనేరు ఆర్టీసీ డిపో మేనేజర్ స్వామితో పాటు ఆర్టీసీ అధికారులతో సమావేశం అయ్యారు. కుప్పం డిపో నుంచి ఇక్కడికి వచ్చిన సర్వీసులు మళ్లీ అక్కడికే వెళ్లిపోయాయని, పుంగనూరు డిపోకు పంపిన సర్వీసులు అక్కడే నిలిచిపోయాయని డిపో మేనేజర్ స్వామి వివరించారు. అదే సమయంలో ఆటోల వల ఆదాయం తగ్గడంతో పలు సర్వీసులు రద్దుచేయాల్సి వచ్చిందని తెలియజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ డిపోలో ఎక్స్‌ప్రెస్ సర్వీసులు పెంచాల్సిన అవసర ముందన్నారు. మళ్లీ డిపోకు పూర్వవైభవం తీసుకొద్దామని పేర్కొన్నారు.

కారుకు దారి ఇవ్వలేదని.. ఆటో డ్రైవర్‌పై దాడి

పుంగనూరు రూరల్, జూన్30: కారుకు దారి ఇవ్వలేదని ఆటో డ్రైవర్‌పై దాడి చేసిన ఘటన పుంగనూరు మండల పరిధిలో జరిగింది. పట్టణంలోని ఎన్ఎస్‌పేటకు చెందిన గంగులప్ప కుమారుడు అశోక్ ఆటో తోలుకుని జీవనం సాగిస్తుండేవాడు. శుక్రవారం రాత్రి ఆటోలో పుంగనూరు నుంచి చీమనిపల్లెకు ప్రయాణికులతో సింగిరి గుంట వద్ద వెళుతుండగా సింగిరిగుంటకు చెందిన వెంకటస్వామి, హేమంత్‌లు కారులో వెనుకవచ్చారు. ఆ క్రమంలో దారి ఇవ్వలేదని ఆటో డ్రైవర్ అశోక్‌పై దాడి చేశారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి



ప్లాస్టరింగ్‌కు నోచుకోని మెట్లు

రామకుప్పం, జూన్ 30: రామకుప్పం శివార్లలో నిబంధనలు పాటించకుండా పాఠశాలను నిర్వహిస్తున్న శాంతినికేతన్ ఇంగ్లీష్ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని పలువురు స్థానికులు కోరారు. విద్యార్థులను ఓ ప్రైవేటు కంపెనీకి చెందిన వాహనంలో తరలిస్తున్నారని వారు పేర్కొన్నారు. పాఠశాలలోని మరుగుదొడ్ల పైకప్పు ధ్వంసమై పోయిందని, మెట్లకు ప్లాస్టరింగ్ కూడా చేయలేదని తెలిపారు. ఎటువంటి భద్రత లేకుండా కేవలం 16 సెంట్లలోనే పాఠశాలను నిర్వహిస్తున్నారని, అర్హతలేని వారిచే విద్యాబోధన చేయిస్తున్నారని తెలిపారు. ఈ విషయమై ఇప్పటికే విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయిందని ఆరోపిస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి

పెద్దపంజాణి, జూన్ 30: అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన మండల కేంద్రానికి కూత వేటు దూరంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. చౌడేపల్లె మండలం కోటూరు గ్రామానికి చెందిన ఇమ్రాన్ మండలంలోని భద్రాచలం గ్రామంలో పెళ్లి చేసుకున్నాడు. ముగ్గురు సంతానం ఉన్నారు. పాత ఇనుప, ప్లాస్టిక్ సామగ్రి వ్యాపారం చేసుకుంటూ అత్తగారింట్లోనే ఇల్లరికం ఉంటున్నాడు. రోజులాగే శనివారం రాత్రి ఇంట్లో భోజనం చేసి బయటకు వెళ్లాడు. ఎంతకీ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల గాలించారు. ఆదివారం గ్రామసమీపంలో చెట్టుకు ఉరేసు కుని ఉన్నాడు. పోలీసులకు సమాచారం అందించారు. మృతుడు చెట్టుకు వేలాడుతున్న తీరు, అతని శరీరంపై ఉన్న గాయాలు చూసి పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదుచేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

భక్తిశ్రద్ధలతో మునీశ్వర దేవర



రామకుప్పం, జూన్ 30: రామకుప్పం మండలం పంద్యాలమడుగులో ఆదివారం గ్రామస్తులు మునీశ్వర దేవరను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం గ్రామశివార్లలోని మామిడి చెట్టు కింద మునీశ్వరస్వామి మూర్తిని ఏర్పాటు చేసి విశేష పుష్పాలంకరణ చేశారు. ఉదయం 11గంటలకు గ్రామస్తులు డప్పుల హోరు, బాణసంచా పేలుళ్ల మధ్య ఊరేగింపుగా బయలుదేరి దేవర స్థలానికి చేరుకున్నారు. అక్కడ స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు స్వామివారికి పొంగళ్లు సమర్పించారు. దీపారాధన చేశారు.

అడవిబజనవాడలో మునీశ్వర్లకు విశేష పూజలు



గుడుపల్లె, జూన్ 30: మండల పరిధిలోని అడవిబజనవాడలో గ్రామంలో ఆదివారం మునీశ్వర్లుకు ప్రజలు విశేష పూజలు నిర్వహించారు. ఏటా నిర్వహించే మునీశ్వర్లు ఉత్సవాల్లో భాగంగా గ్రామానికి దూరంగా పొలాల అంచున చెట్టు కింద అతి పెద్ద ఆకారంలో మునీశ్వరుడు, కొల్ల మునీశ్వరుడు ప్రతిమను బంకమట్టితో తీర్చదిద్దారు. ఆ తరువాత వివిధ రకాల పుష్పాలు, రంగులతో మునీశ్వర్లు ప్రతి మలను అలంకరించారు. గ్రామంలోని మహిళలు డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా వచ్చారు. మునీశ్వర్లు ప్రతిమల వద్ద పిండి దీపాలు వెలిగించారు. పొంగళ్లు పెట్టారు. పలువురు తలనీలాలు సమర్పించారు.

ఎన్టీఆర్ క్రీడా మైదానానికి పూర్వ వైభవం



నాయకులు, క్రీడాకారులతో డాక్టర్ సురేష్ బాబు

కుప్పం, జూన్ 30: కుప్పం ఎన్టీఆర్ క్రీడా మైదానానికి పూర్వ వైభవం తీసుకొస్తామని టీడీపీ నియోజకవర్గ సమన్వయ కమిటీ చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు తెలియజేశారు. ఆదివారం టీడీపీ నాయకులు, క్రీడాకారులు ఎన్టీఆర్ క్రీడా మైదానాన్ని సందర్శించారు. సీఎం చంద్రబాబు నియోజకవర్గాన్ని కీడాభివృద్ధిలో భాగంగా క్రీడా మైదానాన్ని కూడా అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయులను, కోచ్‌లను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. క్రీడా మైదానానికి పీడీగా శేఖర్, కోచ్‌ను నియమిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు డాక్టర్ వెంకటేష్, కన్నన్, అప్పు, సోము, జిమ్ దాము, జాకిర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

విశ్రాంత పీఈటీకి టీడీపీ నివాళులు

సోమల, జూన్ 30: ఇరికిపెంటకు చెందిన టీడీపీ నాయ కుడు, విశాంత్ర పీఈటీ ఉప్పలపాటి వెంక ట్రామ నాయుడుకు పలవురు టీడీపీ నాయకులు నివాళు లర్పించారు. గత నెల 20వ తేదీన ఆయన మృతిచెందారు. ఈక్రమంలో ఆదివారం జరిగిన కర్మక్రియలకు పుంగ నూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి హాజర య్యారు. ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రమణ్యం నాయుడు, మాజీ వైస్ఎంపీపీ ఉమాపతి నాయుడు, హరిప్రసాద్, భానుప్రకాశ్ నాయుడు, మాజీ సర్పంచ్ సులోచన, మోహన్‌నాయుడు, శ్రీనివాసులు నాయుడు, సతీశ్, శివశంకర్, మహేంద్రబాబు, బాబూ రావ్, సీఎం సురేశ్, నగేశ్, వేణుగోపాల్ నాయుడు, కోటీశ్వరరావు, చంద్రశేఖర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

నేడు రూ.7 వేలు పెన్షన్ పంపిణీ

కుప్పం, జూన్ 30: ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చుతున్నారని టీడీపీ కుప్పం మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ అన్నారు. జూలై 1న సోమవారం గత మూడు నెలలు 3 వేలు, పెంచిన 4 వేలు కలిపి మొత్తం రూ.7 వేలు పింఛను లబ్ధిదారులకు అందించనున్నట్లు చెప్పారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు సచివాలయ ఉద్యోగులతోపాటు బీజేపీ, జనసేన, టీడీపీ కుటుంబ సభ్యు లందరూ ప్రతి పెన్షన్ దారుడి ఇంటి వద్దకూ వెళ్లి ఇవ్వాలని కోరారు.

బీసీ భవనం నిర్మించండి



ఎమ్మెల్యే అమరనాథరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న బీసీ ఫ్రంట్ నాయకులు

పలమనేరు, జూన్30 : పలమనేరులో బీసీ భవనం నిర్మించాలని బీసీ ఫ్రంట్ నాయకులు గోవిందస్వామి కోరారు. ఆదివారం టీడీపీ కార్యాల యంలో ఎమ్మెల్యే అమరనాథరెడ్డికి వినతిపత్రం అందజేశారు. 2018 ఆగస్టు 12వ తేదీ పలమనేరులోని 473-3 సర్వే నంబరులోని 15 సెంట్ల స్థలాన్ని బీసీ భవనం కోసం కేటాయించారని గుర్తుచేశారు. తర్వాత ఎవరూ పట్టించుకోలేదన్నారు. అనంతరం ఎమ్మెల్యేను వారు శాలువ కప్పి సన్మా నించారు. ఈ కార్యక్రమంలో పలువురు బీసీ నాయకులు పాల్గొన్నారు.

బొమ్మిదొడ్డిలో ఎమ్మెల్యే పింఛన్ల పంపిణీ

పలమనేరు, జూన్30 : పలమనేరు మున్సిపాలిటీలోని బొమ్మిదొడ్డి గ్రామంలో సోమవారం ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీని ప్రారంభిస్తారని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి తెలిపారు. మున్సిపాలిటీలోని 12 సచివాలయాల పరిధిలో 104 మంది సచివాలయ సిబ్బంది పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని 4682 మందికి పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు కమిషనర్ వివరించారు.

పండుగలా పింఛన్ల పంపిణీ

శాంతిపురం, జూన్ 30 : పండుగ వాతావరణంలో పింఛన్ల పంపిణీ చేపట్టాలని టీడీపీ మండల అధ్యక్షుడు భాష్యం విశ్వనాథనాయుడు, ప్రధాన కార్యదర్శి నాగరాజు పేర్కొన్నారు. ఆదివారం మండల పార్టీ కార్యాలయంలో వారు పలువురు నాయకులతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. మొత్తం రూ.7 వేలు లబ్ధిదారులకు అందిస్తున్నట్లు చెప్పారు. టీడీపీ నాయకులందరూ పాల్గొనాలని సూచించారు.

కూటమి బంధం శాశ్వతం కావాలి



నాయకులను సన్మానిస్తున్న జనసైనికులు

శాంతిపురం, జూన్ 30: జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి శాశ్వత బంధంగా బలపడాలని మండల టీడీపీ అధ్యక్షుడు భాష్యం విశ్వనాథనాయుడు, జనసేన కుప్పం నియోజకవర్గ ఇన్‌చార్జి నరేష్, మండల జనసేన కన్వీనర్ కిషోర్ అన్నారు. ఆదివారం జనసేన కార్యాలయంలో కూటమి నేతలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు రామ్మూర్తి, వేణు, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

సమాజానికి వెలుగునిచ్చేది టీచర్లే



గోవిందరాజుల దంపతులను సన్మానిస్తున్న ఎంపీడీవో మైథిలి, ఉపాధ్యాయులు ఇతర అధికారులు

శాంతిపురం, జూన్ 30 : సమాజానికి వెలుగు నివ్వడమే ఉపాధ్యాయ వృత్తి అని ఎంపీడీవో డాక్టర్ మైథిలి అన్నారు. ఎంఈవో-2 గోవిందరాజులు ఉద్యోగ విరమణ సన్మాన సభను ఆదివారం మండల సచివాలయంలోని సమావేశ మందిరంలో ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. గోవిందరాజులు దంపతులను సన్మానించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తికి గోవిందరాజులు గౌరవం తీసుకొచ్చారని కొనియాడారు. ఆయన శేష జీవితం సంతోషంగా సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అధికారులు ఎంఈవో చంద్రశేఖర్, హేమమాలిని, నంజుడరావు, ఉపాధ్యాయులు రాధాకృష్ణ, ధనంజయ, చంద్రశేఖర్‌నాయుడు, వెంకటేశ్వర్లు, శాంతిపురం, వి.కోట మండలాల ఉపాధ్యాయులు, ఎంఆర్సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మినీ టెంపో చోరీ

రామకుప్పం, జూన్ 30: రామకుప్పంలోఓ మినీటెంపో చోరీకి గురైంది. స్థానిక యువకుడు మధు తన అశోక్‌లేలాండ్ మినీ టెంపోను శనివారం రాత్రి తన ఇంటి ముందు నిలిపి ఉంచాడు. అర్ధరాత్రిలో గుర్తుతెలియని వ్యక్తులు టెంపోను తీసుకెళ్లిపోయారు. తెల్లవారుజామున 2గంటల ప్రాంతంలో టోల్‌గేట్‌లో టోల్‌ఫీజు చెల్లింపు జరిగినట్టు మధు ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. వెంటనే అతడు వి.కోట టోల్‌గేట్ వద్ద సీసీ కెమెరా విజువల్స్ పరిశీలించి అటువైపే టెంపో వెళ్లినట్టు గుర్తించాడు. రామకుప్పం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

వైసీపీ నేతల చెరలో వాటర్ ట్యాంకర్లు



నిరుపయోగంగా ఉన్న ట్రాక్టర్‌లు

గుడుపల్లె, జూన్ 30: గ్రామాల్లో నీటి సమస్య తీర్చడానికి కేటాయించిన ట్యాంకర్లు వైసీపీ నేతల చేతల్లోకి వెళ్లిపోయాయి. ట్రాక్టర్లను వినియోగించకపో వడంతో రెండేళ్లుగా తుప్పు పడుతున్నాయి. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మండలంలోని గ్రామాల్లో నీటి సమస్య తీవ్రంగా ఉండేది. ఈ క్రమంలో పాలకులు, అధికారులు నీటి సమస్య పరిష్కారం కోసం ట్రాక్టర్‌తో పాటు ట్యాంకర్ అవసరమని ప్రభుత్వానికి నివేదించారు. స్పందించిన అప్పటి ఎంపీ ఆదికేశవులనాయుడు పార్లమెంట్ నిధులతో ట్రాక్టర్‌తో పాటు ట్యాంకర్ మంజూరు చేశారు. మండల కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన బోరు ద్వారా నీటిని ట్యాంకర్‌లో నింపి వివిధ గ్రామాలకు సరఫరా చేసేవారు. కొన్నేళ్లపాటు నీటి సరఫరా నిరంతరాయంగా కొనసాగింది. ఆ తరువాత కూడా గ్రామాల్లో నీటి సమస్య అధికం కావడంతో ఎంపీ నిధులతోనే మరో ట్రాక్టర్‌తో పాటు ట్యాంకర్‌ను మండలానికి కేటాయించారు. ఫలితంగా గ్రామాల్లో నీటిసమస్య పరిష్కారమయ్యేది. అయితే ట్రాక్టర్లు నడిపే డ్రైవర్‌లకు జీతాలు అధికారులు సకాలంలో చెల్లించకపోవడంతో వారు విధులకు రాలేదు. ఈ క్రమంలోనే ట్రాక్టర్లు, ట్యాంకర్లు మండల కార్యాలయ ఆవరణలో నిరుపయోగంగా ఉండిపోయాయి. అదేసమయంలో ప్రభుత్వం మారడం వైసీపీ అధికారంలోకి రావడంతో వైసీపీ నాయకుల కన్ను వీటిపై పడింది. ఈవోపీఆర్డీ శంకర్ ద్వారా ట్యాంకర్లను తీసుకెళ్లి పోయారు. వారు సొంతంగా నీటి వ్యాపారం చేసుకోవడం మొదలుపెట్టారు. ట్రాక్టర్లు మాత్రం కార్యాలయం ఆవరణలో తుప్పుపడుతున్నాయి. గత నెల 11న జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో దీనిపై ప్రజాప్రతినిధులు ఈవోపీఆర్డీని నిలదీశారు. ఇప్పటికైన అధికారులు స్పందించి మంచి నీటి ట్యాంకర్‌లను ప్రజల కోసం వినియోగించాలని పలువురు కోరుతున్నారు.

కృషి విజ్ఞానకేంద్రం ఏర్పాటుకు స్థల పరిశీలన



స్థలాన్ని పరిశీలిస్తున్న సురేష్‌బాబు తదితరులు

రామకుప్పం, జూన్ 30: రామకుప్పం మండలంలో కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటు కోసం విజలాపురం సమీపంలోని స్థలాన్ని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.సురేష్‌బాబు ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు విత్తన శుద్ధి, సాగుమెళకువలు, సస్యరక్షణ, నీటి యాజమాన్యం తదితర అంశాలపై అవగాహన కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి విజ్ఞానకేంద్రాన్ని మంజూరు చేసిందన్నారు. విజలాపురం సమీపంలో తాము పరిశీలించిన స్థలంలో కేంద్రం ఏర్పాటుకు స్థానిక నేతలు, రైతులు అంగీకారం తెలిపారన్నారు. అంతకు ముందు ఆయన విజలాపురంలో టీడీపీ పంచాయతీ కమిటీ సమావేశంలో మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమ ఫలాలు ప్రజలకు అందించే విషయంలో ఎటువంటి విభేదాలు లేకుండా ఏకాభిప్రాయంతో ముందుకు సాగి ప్రజల మన్ననలు పొందాలని సూచించారు. ఆయా కార్యక్రమాల్లో టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, పార్టీ మండల, పంచాయతీ అధ్యక్షులు ఆనందరెడ్డి, కుమార్, సీనియర్ నేతలు శ్రీనివాసులురెడ్డి, వెంకటేష్, జయశంకర్, సత్తి తదితరులు పాల్గొన్నారు.

మనస్తాపంతో వృద్ధుడి ఆత్మహత్య

రామకుప్పం, జూన్ 30: తాగునీటి కొళాయివద్ద మహిళలతో జరిగిన చిన్నపాటి గొడవతో మనస్తాపానికి గురై ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన రామకుప్పం మండలం కొర్నాలకొండతాండాలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. కొర్నాలకొండతాండాకు చెందిన బద్యానాయక్(70) కుటుంబసభ్యులు శనివారం మధ్యాహ్నం తాగునీటి కొళాయివద్ద కొందరు మహిళలతో గొడవ పడ్డారు. దీంతో ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం చేటు చేసుకుంది. విషయం తెలుసుకున్న బద్యానాయక్ అక్కడకు చేరుకుని గొడవను సద్దుమణిగించే ప్రయత్నం చేశాడు. ప్రత్యర్థి మహిళలు ఆయన్ను కూడా దుర్భాషలాడారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఆయన శనివారం రాత్రి ఇంట్లో అందరూ నిద్రిస్తున్న సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యచేసుకున్నాడు. కుటుంబసభ్యులు గుర్తించి వెంటనే కిందకు దించారు. అప్పటికే ఆయన మృతిచెందాడు. మృతుడి కుమారుడు చంద్రశేఖర్‌నాయక్ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కల్లూరు లయన్స్ క్లబ్‌కు ఐదు ఉత్తమ అవార్డులు



అవార్డులను అందుకుంటున్న లయన్స్‌క్లబ్ నిర్వాహకులు

కల్లూరు, జూన్ 30: పులిచెర్ల మండలం కల్లూరు లయన్స్‌క్లబ్ అందించిన సేవలకు ఫలితంగా ఐదు ఉత్తమ అవార్డులు దక్కినట్లు లయన్స్‌క్లబ్ గవర్నర్ రామరాజ్ ఆర్స్ తెలిపారు. బెంగుళూరులోని కర్ణాటక ప్రభుత్వ బిలియర్స్ ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో కల్లూరు లయన్స్‌క్లబ్‌కు ఉత్తమ రూరల్ క్లబ్ అవార్డు, ఉత్తమ లియోక్లబ్ అవార్డు, ఉత్తమ జిల్లా క్రీడా విభాగం అవార్డు, ఉత్తమ కార్యదర్శి అవార్డు, క్లబ్ ప్రత్యేక అవార్డులు అందజేశారు. ఈ అవార్డులను జిల్లా లయన్స్‌క్లబ్ క్రీడావిభాగం అధ్యక్షులు మహమ్మదాలి, లయన్స్‌క్లబ్ కార్యదర్శి వెంకటసిద్దులు అందుకున్నారు. ఈ అవార్డులను లయన్స్‌క్లబ్ అంతర్జాతీయ డైరెక్టర్ కృష్ణారెడ్డి అంజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ డిప్యూటీ గవర్నర్ అశ్వత్ నారాయణ, దినేష్, మనోజ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

గృహప్రవేశ వేడుకల్లో చల్లా బాబు



కల్లూరు, జూన్ 30: పులిచెర్ల మండలం కల్లూరుకు చెందిన టీడీపీ యువ నాయకుడు ఇమ్రాన్ గృహ ప్రవేశ వేడుకలకు ఆదివారం పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జ్ చల్లా బాబు హాజరయ్యారు. చల్లా బాబుకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. అనంతరం టీడీపీ నాయకులు ఇమ్రాన్ తదితరులు ఆయన్ను దుశ్శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మురళీధర్ నాయుడు, రవినాయుడు, ఉయ్యాల రమణ, ఇర్ఫాన్, ఖాదర్‌వల్లి, అబ్బాస్, కరుణాకర్ నాయుడు, చిట్టిబాబు నాయుడు, అల్తాఫ్, నాసిర్, మూసా తదితరులు పాల్గొన్నారు.

పవన్ అడుగుజాడల్లో నడుద్దాం



మాట్లాడుతున్న చిన్నరాయల్

కల్లూరు, జూన్ 30: జనసేన పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ అడుగుజాడల్లో మనందరం నడుద్దామని ఆ పార్టీ పుంగనూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చిన్నరాయల్ పిలుపునిచ్చారు. పులిచెర్ల మండలం మంగళంపేటలో ఆదివారం మండల జనసేన పార్టీ కార్యవర్గం సమావేశం, విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. గ్రామస్థాయి నుంచి జనసేన పార్టీ బలోపేతానికి చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు చంద్రబాబు, మోహన్, మునేష్, మనోహర్, దీపు, మధు, ఆంజి, గిరి, మునిశేఖర్, నవీన్, శేఖర్, గంగాధర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

పలమనేరు, జూన్30 : పలమనేరు మున్సిపాలిటీలోని గొబ్బిళ్లకోటూరు గ్రామంలో ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రబోధ సేవాసమితి, ఇందు జ్ఞానవేదిక పలమనేరు, బంగారు పాళ్యం కమిటీల అధ్యక్షులు భాస్కర్, బాలాజి ప్రచారం చేశారు. ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీత పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇందూ జ్ఞానవేదిక సభ్యులు జ్యోతి, రేఖ కళ్యాణి, జీవరత్న, హేమంత్, ఉదయ్ పాల్గొన్నారు.

అర్హులందరికీ పెంచిన పింఛన్

సోమల, జూన్ 30: అర్హులందరికీ పెంచిన పింఛను అంద జేస్తామని పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన ఇరికిపెంటలో విలేకరులతో మాట్లాడుతూ జూలై 1న పింఛను పంపిణీలో నాయకులంతా పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సుబ్రమణ్యం నాయు డు, శ్రీనివాసులు నాయుడు, మోహన్‌నాయుడు, హరిప్రసాద్, రమేష్ నాయుడు, భానుప్రకాశ్ పాల్గొన్నారు.

ఘనంగా ఉద్యోగ విరమణ సన్మానాలు



రాధాకృష్ణన్‌ను సన్మానిస్తున్న ఆర్టీసీ యూనియన్



టీచర్ వరదరాజన్ దంపతులకు సన్మానం

కుప్పం, జూన్ 30: కుప్పం ఆర్టీసీ డిపోలో 35 ఏళ్లుగా వివిధ హోదాల్లో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన బీఎస్.రాధాకృష్ణను సతీమణి సమేతంగా ఆర్టీసీ డిపోలోని ఉద్యోగులు, సిబ్బంది ఆదివారం ఘనంగా సన్మానించారు. ఆర్టీసీకి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజరు బీవీ.లక్ష్మణ రావు, మెకానికల్ ఇంజినీరు ప్రేమ్‌కుమార్, ఎన్ఎంయూ డిపో అధ్యక్షుడు ఎస్.మునస్వామి, కార్యదర్శి జయపాల్ ఈయూ జిల్లా అధ్యక్షుడు కె.బలరాం, డిపో అధ్యక్షుడు ఎంసీ.రాయప్ప, సీకే.రవ, కార్యదర్శి ఎం.కరుణాకర్, నాయకులు పి.బాష, ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

- **ఉపాధ్యాయుడికి సన్మానం**

శీగలపల్లె పాఠశాల ఉపాధ్యాయుడిగా ఉద్యోగ విరమణ చేసిన వరద రాజన్ దంపతులను కుప్పం మండలం చీమనాయని పల్లెలో ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథులుగా కుప్పం, గుడుపల్లె మండల ఎంఈవోలు మహబూబ్ బాషా, శ్రీదేవి విచ్చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుబ్బరామన్, వెంకటేశ్వర బాబు, కార్తికేయన్, శ్రీదేవి, అమరజ్యోతి, శరవణన్ పాల్గొన్నారు.

ఘనంగా హిందూ సామ్రాజ్య శోభాయాత్ర





ఆకట్టుకుంటున్న హనుమంతుడి వేషధారి, శోభాయాత్రలో మోటారు సైకిల్ ర్యాలీ

పుంగనూరు రూరల్, జూన్30: హిందూ సామ్రాజ్య దినోత్సవాన్ని పుంగనూరులో ఘనంగా నిర్వహించారు. హిందూ సామ్రాజ్య శోభాయాత్రలో భాగంగా ఆదివారం స్థానిక ఎన్ఎస్‌పేట వీరాంజనేయస్వామి ఆలయం నుంచి భక్తులు జై శ్రీరామ్, జై ఛత్రపతి శివాజీ అంటూ నినాదాలు చేస్తూ కట్టకిందపాళ్యం, కుమ్మరవీధి, తూర్పుమొగసాల ఎంబీటీ రోడ్డు, ప్రైవేటు బస్టాండ్ మీదుగా యువకులు నృత్యాలు చేస్తూ, మహిళలు చెక్కభజనలు చేస్తూ ఊరేగింపుగా ఎన్టీఆర్ సర్కిల్‌కు చేరుకున్నారు. ఓ భక్తుడి ఆంజనేయుడి వేషధారణ విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం హిందూ జాగరణ సభ్యులు మాట్లాడుతూ హిందువుల ఐక్యంగా ఉండాలని, సంస్కృతిని కాపాడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో త్రిమూర్తిరెడ్డి, పరమేశ్, గంగాధర్, హరి, వెంకటేశ్, రవిరాజు, నాగరాజు, శివ పాల్గొన్నారు.

ట్యాంకుల పేరుతో ప్రజాధనం దుర్వినియోగం

- ట్యాంకు ఉన్నా మరో ట్యాంకు
- ఊరే లేదు... అయినా ట్యాంకు నిర్మాణం
- కాంట్రాక్టర్ల సేవలో వైసీపీ ప్రభుత్వం

కల్లూరు, జూన్ 30: అవసరం లేకున్నా తాగునీటి ట్యాంకుల నిర్మాణం చేపడుతూ ప్రజాధనం దుర్వినియోగం అవుతున్న విషయం పులిచెర్ల మండలంలో ఆలస్యంగా వెలుగుచూసింది. జేజేఎం నిధులతో పులిచెర్ల మండలంలో 68 తాగునీటి ట్యాంకులు నిర్మించేందుకు వైసీపీ ప్రభుత్వం టెండర్లు పిలిచింది. మండలంలో తాగునీటి ట్యాంకుల నిర్మాణ పనుల కాంట్రాక్టును ప్రకాశం జిల్లాకు చెందిన ఓ కాంట్రాక్టరు దక్కించుకున్నాడు. గతేడాది ట్యాంకుల నిర్మాణం పనులను ప్రారంభించగా వివిధ స్థాయిల్లో నిర్మాణ పనులు జరుగుతున్నాయి.

మండలంలోని దిగువపోకలవారిపల్లి పంచాయతీలోని ఓ ప్రాంతంలో ఊరు లేకున్నా రెవెన్యూ రికార్డుల్లో చెన్నారెడ్డి ఇండ్లు పేరుతో రూ.15 లక్షలతో తాగునీటి ట్యాంకును మంజూరు చేశారు. ప్రస్తుతం ట్యాంకు నిర్మాణం పనులు చేపడుతున్నారు. పాళెం పంచా యతీ కేంద్రంలో 40 వేల లీటర్ల సామర్థ్యం గల తాగునీటి ట్యాంకును పాళెం, జూపల్లి ప్రజల దాహార్తి తీర్చేందుకు పదేళ్ల క్రితం నిర్మించారు. అనంతరం జూపల్లికి మరో తాగునీటి ట్యాంకును నిర్మించడంతో పాత తాగునీటి ట్యాంకు నీటిని పాళెం ప్రజలు మాత్రమే ఉపయోగించు కుంటున్నారు. ప్రస్తుతం పాళెంలో సుమారు 45 కుటుంబాలు ఉండగా 200 మంది జనాభా జీవిస్తున్నారు. అయితే అవసరం లేకపోయినా పాళెం గ్రామానికి మరో అదనపు ట్యాంకును నిర్మించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇక్కడా ట్యాంకు నిర్మాణం పనులు జరుగుతున్నాయి. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని అదనంగా ట్యాంకును నిర్మిస్తున్నామని ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ రాజేంద్ర తెలిపారు. పాళెం ప్రజల దాహార్తిని తీర్చేందుకు నిర్మించి ఉన్న 40 వేల లీటర్ల ట్యాంకు సరిపోతుందని, అనవసరంగా అదనపు ట్యాంకు నిర్మాణం పనులు చేపడుతున్నారని ప్రజలు గుసగుసలాడుతున్నారు. అయితే మరింత అధిక జనాభా ఉన్న గ్రామాలకు అదనపు ట్యాంకు ఎందుకు నిర్మించడం లేదని ప్రశ్నిస్తే సంబంధిత అధికారుల నుంచి సమాధానం రావడంలేదు. రెవెన్యూ రికార్డులో ఉన్న చెన్నారెడ్డి ఇండ్లు పేరుతో ట్యాంకు మంజూరైందని, దీంతో ట్యాంకును నిర్మిస్తున్నామని అధికారులు చెబుతున్నారు. పాళెంలో ట్యాంకు ఉన్నా మరో ట్యాంకును నిర్మించి ప్రజా. దనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ప్రజలు మండి పడుతున్నారు. అధికారులు పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



లేని ఊరు పేరుతో చేపట్టిన ట్యాంకు నిర్మాణం

పోలీసు కుటుంబ సభ్యులకు అండగా ఉంటాం



ఉద్యోగ విరమణ పొందిన వారిని సన్మానిస్తున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు, జూన్ 30: పోలీసు శాఖకు సేవలందించిన వారంతా పోలీసు కుటుంబ సభ్యులేనని, వారికి అధికారులు అండగా ఉంటారని ఎస్పీ మణికంఠ అన్నారు. పోలీసు శాఖకు 42 ఏళ్ల సేవలందించి ఉద్యోగ విరమణ పొందుతున్న ఏఎస్ఐలు మణి, జయదేవరెడ్డి, మునియప్ప, కానిస్టేబుల్ లోకయ్య, హోంగార్డులు మురగయ్య, పరిమళలను పోలీసు అతిథి గృహంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. ఒన్‌టౌన్ సీఐ విశ్వనాథరెడ్డి, ఎంటీవో భాస్కర్, హోం గార్డు ఆర్ఐ సుధాకర్, పోలీసు అసోసియేషన్ అధ్యక్షుడు ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఐరాలలో కుక్కల బెడద



వీఎస్ అగ్రహారంలో కుక్కలు

ఐరాల, జూన్ 30: మండల కేంద్రమైన ఐరాలలో కుక్కల బెడద ఎక్కువైంది. ప్రతి వీధిలోనూ పదుల సంఖ్యలో కుక్కలు సంచరిస్తున్నాయి. ప్రధానంగా వీఎస్.అగ్రహారం నుంచి బజారు వీధి వరకు రోడ్డుపై సంచరిస్తూ వాహనదారులను వెంటాడుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. వాటి బారినపడి ఇప్పటికే పలువురు గాయాలపాలయ్యారు. వీఎస్ అగ్రహారంలోని వారపు సంతలో ఎక్కువగా దాడి చేస్తున్నాయి. చికెట్ దుకాణాల వద్ద మాంసానికి అలవాటుపడి అక్కడ దొరకని సమయంలో మనుషులపై దాడికి పాల్పడుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. అధికారులు వాటిపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

తవణంపల్లె ఎస్ఐగా అనిల్‌కుమార్



తవణంపల్లె, జూన్ 30: తవణంపల్లె ఎస్ఐగా అనిల్‌కుమార్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న సుధాకర్‌రెడ్డి బదిలీపై వెళ్లడంతో అనిల్‌కుమార్‌ను నియమించారు. శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తానన్నారు.

వైభవంగా కోదండరాముడి తెప్పోత్సవం



తవణంపల్లె, జూన్ 30: మండలంలోని టి.పుత్తూరు కోదండరామాలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం తెప్పోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి నిత్య కైంకర్యాలు, తిరుమంజనం, పాలాభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఊంజల్‌సేవ అనంతరం మేళతాళాల నడుమ పుష్కరిణిలో తెప్పలపై ఉంచి విహరింపజేశారు. ఆలయ ధర్మకర్త సిద్ధేశ్వరరెడ్డి, ఉభయదారులు పాల్గొన్నారు.

కృష్ణమూర్తి కుటుంబానికి పరామర్శ



కృష్ణమూర్తి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న తిరుపతి ఎమ్మెల్యే శ్రీనివాసులు

గుడిపాల, జూన్ 30: మండలంలోని కుప్పిగానిపల్లిలో 15 రోజుల క్రితం క్యాన్సర్‌తో మృతిచెందిన కృష్ణమూర్తి కుటుంబాన్ని ఆదివారం చిత్తూరు, తిరుపతి ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్, ఆరణి శ్రీనివాసులు పరామర్శించారు. నాయకులు సుబ్రహ్మణ్యం నాయుడు, బాలాజి నాయుడు, రూపేష్ కుమార్, చిట్టిబాబు, ఉప్పులింగయ్య ఉన్నారు.

ఎటుచూసినా పారిశుధ్య లోపం



సంత పక్కనున్న మురుగు నీరు, కోళ్ల వ్యర్థాలు

శ్రీరంగరాజపురం, జూన్ 30: మండలంలోని 49. కొత్తపల్లెమిట్ట గ్రామ పంచాయతీలో పారిశుధ్యం మచ్చుకైనా కనిపించడం లేదు. గ్రామ పరిధిలోని చిత్తూరు- పుత్తూరు జాతీయ రహదారిపై మురుగు నీరు ప్రవహిస్తున్నాయి. కోళ్ల వ్యర్థాలను రోడ్డు పక్కనే పడేస్తున్నారు. అవి కుళ్లి దుర్వాసన వెదజల్లుతున్నాయి. వాటికోసం కుక్కలు రోడ్డుపైకి వస్తుండడంతో వాహనదారులు ప్రమాదానికి గురవుతు న్నారు. అధికారులు వాటిపై దృష్టి పెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ఘర్షణలో ఒకరికి గాయాలు

గుడిపాల, జూన్ 30: మండలంలోని పేయనపల్లి గ్రామంలో ఇంటి స్థలం విషయంలో జరిగిన ఘర్షణలో మహిళకు గాయాలయ్యాయి. ఇంటిస్థలం విషయమై మాధవయ్య, చిన్నబ్బ కుటుంబాల మధ్య మాటామాటా పెరిగి, ఘర్షణకు దారితీసింది. అడ్డుకోవడానికి వెళ్లిన కళావతి తీవ్రంగా గాయపడ్డారు. ఆమెను చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు గుడిపాల పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శివారెడ్డి సేవలు మరువలేనివి



శివారెడ్డిని సన్మానిస్తున్న బసిరెడ్డి, నిరంజన్ రెడ్డి

చిత్తూరు సిటీ, జూన్ 30: ఎంవీఐ శివారెడ్డి సేవలు మరువలేనివని డీటీసీ నిరంజన్ రెడ్డి, బసిరెడ్డి అన్నారు. ఆదివారం చిత్తూరు ఆర్టీవో కార్యాలయంలో శివారెడ్డి ఉద్యోగ విరమణ చేశారు. ఆయన్ను ఘనంగా సత్కరించారు. ఎంవీఐలు సురేష్ నాయుడు, ప్రసాద్ వర్మ, సీతారామరెడ్డి, వాసుదేవరెడ్డి, మురళి, రాజేశ్వరరావు, దీపిక, శివకుమార్, హేమకుమార్ తదితరులు పాల్గొన్నారు.

దామోదరం సేవలు భేష్



దామోదరాన్ని సన్మానిస్తున్న ఎంఈవో

విజయపురం, జూన్ 30: జంబాడ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం దామోదరం సేవలు ఆదర్శనీయమని ఎంఈవో హరిప్రసాద్‌వర్మ పేర్కొన్నారు. ఉద్యోగ విరమణ సందర్భంగా విజయపురం విద్యావనరుల కార్యాలయంలో దామోదరాన్ని ఆదివారం ఘనంగా సన్మానించారు. భారత సైన్యంలో, ఉపాధ్యాయ వృత్తిలో సేవలను కొనియాడారు. రిటైర్డు ఎంఈవోలు కైలాసం, జయదేవ్, రైటైర్డు ఉపాధ్యాయుడు చంద్రయ్య పాల్గొన్నారు.

22 ఏళ్ల తర్వాత అ'పూర్వ' కలయిక



గంగాధరనెల్లూరు, జూన్ 30: 2001-02 సంవత్సరంలో తూగుంద్రం హైస్కూల్‌లో పదో తరగతి చదివిన విద్యార్థులు 22 ఏళ్ల తర్వాత పాఠశాల ప్రాంగణంలో ఆదివారం కలిశారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించి, పాదాభివందనం చేశారు. టీచర్లు మాట్లాడుతూ 22ఏళ్ల క్రితం పాఠాలు చెప్పిన గురువులను గుర్తుపెట్టుకుని సన్మానించడం ఆనందంగా ఉందన్నారు. పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి ఏటా తమవంతు సహకారం అందిస్తామన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రోత్సహిస్తామని తెలిపారు. అనంతరం రూ.20వేల విలువైన బీరువాను పాఠశాలకు అందజేశారు.

చిత్తూరు

జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

నేడు ప్రజా ఫిర్యాదుల కార్యక్రమం

చిత్తూరు, జూన్ 30: చిత్తూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల కార్యక్రమం జరుగుతుందని కమిషనర్ అరుణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి జరిగే ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని పేర్కొన్నారు.

తాగునీటి బోరు మరమ్మతు చేయండి

పాలసముద్రం, జూన్ 30: తాగునీటి బోరు మోటారును మరమ్మతు చేయాలని శ్రీబొమ్మరాజుపురం గ్రామస్తులు కోరుతున్నారు. రెండ్రోజులుగా పనిచేయకపోవడంతో తాగునీటికి ఇబ్బంది పడుతున్నామని, పంచాయతీ అధికారులు, సర్పంచ్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని తెలిపారు. వ్యవసాయ బావుల నుంచి నీరు తెచ్చుకోవాల్సి వస్తోందని, ఇప్పటికైనా స్పందించి ట్యాంకరు ద్వారానైనా నీరు సరఫరా చేయాలని కోరుతున్నారు.

ఘనంగా మాతమ్మ తిరునాళ్ల



మాతమ్మకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

విజయపురం, జూన్ 30: మండలంలోని విజయపురం అరుందతివాడ, మల్లారెడ్డికండ్రిగ అరుందతివాడలో ఆదివారం మాతమ్మ తిరుణాళ్లను వైభవంగా నిర్వహించారు. విజయపురంలో మాతమ్మ సేవలో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్, మల్లారెడ్డికండ్రిగలో చిత్తూరు పార్లమెంటు అధికార ప్రతినిది చినబాబు పాల్గొన్నారు. భక్తులు ఉదయం మాతమ్మకు అంబలి పోసి మొక్కు తీర్చుకున్నారు. గెరిగను ఊరేగించి సాయంత్రం అగ్నిగుండ ప్రవేశం నిర్వహించారు. రాత్రి మాతమ్మను పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ బీసీ సెల్ అధికార ప్రతినిది చుక్కా ధనుంజయయాదవ్, మండల టీడీపీ అధ్యక్షుడు రమేష్‌రాజు, ప్రధాన కార్యదర్శి బాబుయాదవ్, నాయకులు బాలసుబ్రహ్మణ్యంరాజు, సుధాకర్‌రాజు, సమసింహారెడ్డి, మునిశేఖర్‌శెట్టి పాల్గొన్నారు.

హేమారెడ్డికి ఘన సన్మానం



మాట్లాడుతున్న తిరుపతి డీఈవో శేఖర్

కార్వేటినగరం, జూన్ 30: కత్తెరపల్లి జడ్పీ హైస్కూల్ హెచ్ఎం హేమారెడ్డిని ఆదివారం ఘనంగా సన్మానించారు. ఉద్యోగ విరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తిరుపతి డీఈవో శేఖర్ ఉపాధ్యాయుడిగా హేమారెడ్డి చేసిన సేవలను కొనియాడారు.

ఉచిత గుండె వైద్య శిబిరానికి స్పందన



పెనుమూరు, జూన్ 30: గుండె సంబంధిత వ్యాధులకు సంబంధించి పెనుమూరు ఎమ్మార్సీలో తిరుపతి వెంకటరమణ ఆస్పత్రి అధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. టీడీపీ మండలాధ్యక్షుడు రుద్రయ్య నాయుడు సహకరంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో పలు గ్రామాల ప్రజలకు బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలు చేసుకుని ఉచితంగా మందులు తీసుకున్నారు. డాక్టర్లు వెంకటరమణ, నిరుపమ పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మృతి



గంగిరెడ్డి

వెదురుకుప్పం, జూన్ 30: యనమలమంద గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ అంగేరి గంగిరెడ్డి(70) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. పలువురు నాయకులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి, నివాళులర్పించారు.

మన్ కీ బాత్ వీక్షణ

వెదురుకుప్పం, జూన్ 30: మండలంలోని పచ్చికాపల్లంలో ప్రధాని మోదీ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని బీజేపీ నాయకులు, ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పాముల శేషాద్రి కుమార్ ఆదివారం టీవీలో వీక్షించారు. ప్రధాని ప్రసంగాన్ని విన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు విశ్వనాథరెడ్డి, నాయకుడు విజయకుమార్ పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రం పేరు మార్పు

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 30: ఇకనుంచి వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల పేరును రైతు సేవా కేంద్రం'గా మారుస్తూ బోర్డు ఏర్పాటు చేయాలని ఏపీ ప్రభుత్వ వ్యవసాయ ప్రత్యేక కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే ఆర్బీకేల్లోని కియోస్కోలు, సాఫ్ట్‌వేర్ యాప్‌ల్లో చిత్రీకరించిన నవరత్నాలు, లోగోలోని మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి ఫొటోను తక్షణమే తొలగించి నూతన సీఎం చంద్రబాబు ఫొటో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. జిల్లా వ్యవసాయ సలహా బోర్డుతో పాటు మండల స్థాయి బోర్డులను వెంటనే రద్దు చేయాలని ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు.

వైభవంగా అగ్నిగుండ ప్రవేశం



నింద్ర, జూన్ 30: నింద్ర ఆదిఆంధ్రవాడ మాతమ్మ తిరునాళ్లలో భాగంగా ఆదివారం అగ్నిగుండ ప్రవేశం నిర్వహించారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం పొంగళ్లు పెట్టి, నైవేద్యం సమర్పించారు. కంకణం ధరించిన భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేశారు. అమ్మవారిని విశేషంగా అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు.

నేడు పెన్షన్ల పంపిణీ

గంగాధరనెల్లూరు, జూన్ 30: నియోజకవర్గంలో సోమవారం ఎమ్మెల్యే థామస్ చేతుల మీదుగా పింఛన్లు పంపిణీ చేయనున్నారు. ఉదయం 6 గంటలకు జీడీ నెల్లూరు, 7 గంటలకు పెనుమూరు, 8గంటలకు వెదురుకుప్పం, 9.30 గంటలకు శ్రీరంగరాజుపురం, 10.30గంటలకు కార్వేటినగరం, 11.30గంటలకు పాలసముద్రం ఎంపీడీవో కార్యాలయాల్లో పంపిణీ చేయనున్నారు.

వీధుల్లో తిరుగుతూ..సమస్యలు తెలుసుకుంటూ

● ఎమ్మెల్యే గురజాల మార్నింగ్ వాక్



మురికికాల్వను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జగన్మోహన్

చిత్తూరు, జూన్ 30: చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ఆదివారం నగరంలోని పలు వీధుల్లో తిరుగుతూ ప్రజలతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 31, 32 డివిజన్ల పరిధిలోని ఆర్టీసీ డిపో రోడ్డు, టెలిఫోన్ కాలనీల్లో మురుగునీటి కాల్వలను పరిశీలించారు. స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలువల వెడల్పు, మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వినాయకుడి వీధి, రామ్‌నగర్ కాలనీల్లో పర్యటించి, మురుగునీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ అరుణ, సహాయ కమిషనర్ రామకృష్ణుడు, ఆర్వో గోపాలకృష్ణ వర్మ, డీఈ రమణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 30: చిత్తూరు నియోజకవర్గ అభివృద్ధికి సహకారం అందించాలని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ కోరారు. ఆదివారం సాయంత్రం కలెక్టరేట్‌లో కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలిసి, సన్మానించారు. నియోజకవర్గాన్ని ముందు వరుసలో నిలిపేందుకు సహకారం అందిస్తామని కలెక్టర్ ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు.

ఎమ్మెల్యేకు డ్రైవర్ల సంఘం సన్మానం

చిత్తూరు సిటీ, జూన్ 30: చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌ను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ డ్రైవర్ల సంఘం ఉమ్మడి చిత్తూరు జిల్లా నేతలు ఆదివారం సన్మానించారు. నగరంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో కలసి శ్రీవారి చిత్రపటం, పుష్పగుచ్ఛం ఇచ్చారు. డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

గ్రావెల్ క్వారీపై సమగ్ర విచారణ జరపండి

మండల మీట్‌లో ఎమ్మెల్యే భానుప్రకాష్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

విజయపురం, జూన్ 30: మండలంలో గతంలో నిర్వహించిన గ్రావెల్ క్వారీలపై సమగ్రంగా విచారణ చేపట్టాలని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. ఆదివారం విజయపురం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ జమున అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఒక సర్వే నంబర్‌లో అనుమతి తీసుకొని గ్రావెల్‌ను విచ్చలవిడిగా తమిళనాడుకు తరలించారని తెలిపారు. ఈ విషయమై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మండల పరిషత్ నిధులు దుర్వినియోగమయ్యాయన్న ఫిర్యాదులపైనా విచారణ జరపాలన్నారు. మండలంలో తాగునీటి సమస్య లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. పింఛన్ల పంపిణీకి సహకరించాలని కోరారు. అంతకుముందు ఆయన్ను కూటమి నేతలు సన్మానించారు. సమావేశంలో డీఎస్పీ నరసింహమూర్తి, ఎంపీడీవో బ్రహ్మయ్య తహసీల్దార్ మల్లికార్జునరావు, జడ్పీటీసీ రేవతి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోండి



బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

తవణంపల్లె, జూన్ 30: ఆర్టీసీ బస్సు ప్రయాణం సురక్షితమైందని, వాటి సేవలను సద్వినియోగం చేసుకోవాలని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ కోరారు. మండలంలోని ఎ.గొల్లపల్లెలో ఆదివారం సర్పంచ్ సబిత ఆధ్వర్యంలో కాణిపాకం-బంగారుపాళ్యం వయా అరగొండ, ఎ.గొల్లపల్లె నూతన ఆర్టీసీ బస్సు సర్వీసును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. తనకు ఎమ్మెల్యే హోదా ఇచ్చిన ప్రజల అభివృద్ధి, శ్రేయస్సు కోసం పనిచేస్తానన్నారు. చిత్తూరు 1-డిపో మేనేజరు కృష్ణమూర్తి, టీడీపీ మండలాధ్యక్షుడు గాలి దిలీప్, మాజీ జడ్పీటీసీ వెంకటేష్‌చౌదరి, మాజీ ఎంపీపీ సరళకుమారి, నాయకులు ప్రవీణ్, పరంధామనాయుడు, సతీష్, ప్రకాష్‌నాయుడు, గోపి పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమంపైనే ప్రభుత్వ దృష్టి



విజయోత్సవ సభలో మాట్లాడుతున్న యుగంధర్

కార్వేటినగరం, జూన్ 30: వచ్చే ఐదేళ్లు ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగుతుందని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పొన్నా యుగంధర్ పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావడంతో ఆదివారం కార్వేటినగరం ధర్మరాజుల గుడి ప్రాంగణంలో విజయోత్సవ సభ నిర్వహించారు. తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి జనార్దన్ రాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సభలో యుగంధర్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడమే గాక సంక్షేమ పాలన అందించేలా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పనిచేస్తారని తెలిపారు. జనార్దన్ రాజు, తెలుగు రైతు చిత్తూరు పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు నాగేశ్వరరాజు మాట్లాడుతూ గాజులమండ్యం, చిత్తూరు షుగర్ ఫ్యాక్టరీలను తెరిపిస్తామని హామీ ఇచ్చి వైసీపీ ప్రభుత్వం మాట నిలబెట్టుకోలేదన్నారు. యువమోర్చా నాయకులు యువరాజు, బీజేపీ మండలాధ్యక్షుడు రాజశేఖర్, టీడీపీ నాయకులు ఇందిర, చెంగల్‌రాయల్ యాదవ్, వాసుదేవరెడ్డి, రవియాదవ్, ఈశ్వర్, జనసేన నేతలు శోభన్ బాబు, రాఘవ, వెంకటేష్, సతీష్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న దుర్యోధన వధ

- వేడుకగా ధర్మరాజ స్వామి పట్టాభిషేకం



మడుగు నుంచి దుర్యోధన వేషధారిని తీసుకొస్తూ...

వెదురుకుప్పం, జూన్ 30: మహా భారత ఉత్సవాల్లో భాగంగా ఆదివారం చవటగుంట ద్రౌపది అమ్మవారి ఆలయ ఆవరణలో ప్రదర్శించిన దుర్యోధన వధ ఘట్టం ఆకట్టుకుంది. ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో దుర్యోధనుడి మట్టి బొమ్మను తీర్చిదిద్దారు. మడుగులో దాగి ఉన్న దుర్యోధన వేషధారిని ఆ బొమ్మ వద్దకు తీసుకొచ్చారు. దుర్యోధన వధ ఘట్టాన్ని ప్రదర్శించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు తరలివచ్చారు. ఈ కార్యక్రమానికి వెదురుకుప్పం మండలం బండమీద ఇండ్లుకు చెందిన పోటుగారి గంగయ్య, గిరిజ, శ్రీధర్‌రాయల్ కుటుంబీకులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఆలయ పూర్వ ధర్మకర్త పేట రామచంద్రారెడ్డి భార్య రాజమ్మ ఉభయదారుగా ధర్మరాజుల వారి పట్టాభిషేక మహోత్సవం నిర్వహించారు. ఆలయ ఆవరణలో అగ్నిగుండ ప్రవేశం చేశారు. టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి పి.మోహన్‌మురళి ఉభయదారుగా అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. వెదురు కుప్పం యూత్ ఆధ్వర్యంలో అన్నప్రసాదం పంపిణీ చేశారు. ఆలయ ధర్మకర్త పేట రాధాకృష్ణారెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అక్రమ క్వారీని అడ్డుకున్న గ్రామస్తులు



పాలసముద్రం, జూన్ 30: మండలంలోని వనదుర్గాపురం గ్రామ అటవీ ప్రాంతంలో తమిళనాడుకు చెందిన ప్రభుత్వోద్యోగి నిర్వహిస్తున్న అక్రమ క్వారీ పనులను గ్రామస్తులు ఆదివారం అడ్డుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా కంకర, గ్రావెల్ తరలించుకుని వెళ్లి తమిళనాడులో విక్రయించుకుంటున్నారని, పంచాయతీకి సరిగా పన్నులు సైతం కట్టడం లేదని తెలిపారు. అక్రమ క్వారీ గురించి జిల్లా మైన్స్, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. మామూళ్లకు అలవాటుపడి చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్తే లక్ష్యం



ఎస్ఈ సురేంద్రనాయుడు

చిత్తూరు రూరల్, జూన్ 30: వ్యవసాయానికి 9 గంటల నాణ్యమైన, నిరంతర విద్యుత్తు అందించ డమే తమ లక్ష్యమని ట్రాన్స్‌కో ఎస్ఈ సురేంద్రనాయుడు తెలిపారు. ఆదివారం గిరింపేటలోని ట్రాన్స్‌కో అతిథిగృహంలో ఆయన మాట్లాడు తూ ఈనెల నుంచి జిల్లాలోని అన్ని లైన్లు, ఫీడర్లు, స్తంభాల మరమ్మతు డ్రైవ్ ప్రారంభిస్తున్నామన్నారు. ఈ పనులు పూర్తికాగానే రైతులకు నాణ్యమైన 9 గంటల నిరంతర విద్యుత్ సాధ్యపడుతుందన్నారు. విద్యుత్ అంతరాయం కారణంగా పంటలు ఎండిపోకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి బుధవారం ఎస్ఈ, ఈఈ కార్యాలయాల్లో గ్రీవెన్స్ డే నిర్వహించనున్నామని, రైతులు, వినియోగదారుల సమస్యలపై అర్జీలు ఇవ్వవచ్చునని తెలిపారు. తక్షణ ఫిర్యాదు కోసం 1912 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు. తమిళనాడు సరిహద్దు మండలాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురవుతున్నాయని, వాటి నివారణకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. చోరీకి గురైన వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తున్నామన్నారు.

పండగ వాతావరణంలో పింఛన్ల పంపిణీ

చిత్తూరు రూరల్, జూన్ 30: పండగ వాతావరణంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించాలని టీడీపీ జిల్లా నేత చంద్రప్రకాష్ కోరారు. ఆదివారం టీడీపీ జిల్లా కార్యాలయంలో రూరల్ నాయకులతో ఆయన సమావేశమై మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం చంద్రబాబు రూ.4 వేలు పింఛన్ ఇస్తానన్న హామీ మేరకు పెంచిన దాంతోపాటు ఏప్రిల్ నెల నుంచి కలిపి రూ.7 వేలు ఇస్తున్నారని తెలిపారు. ఈ విషయాన్ని లబ్ధిదారులకు వివరించాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, టీడీపీ జిల్లా కార్యదర్శి జయచంద్రనాయుడు, నాయకులు మోహన్‌రాజ్, శశికర్‌బాబు, రఘు, కుమార్, జగదీష్, దేవరాజులు నాయుడు, చల్లా, రమేష్‌నాయుడు, గిరి తదితరులు పాల్గొన్నారు.

పోలవరం విధ్వంసానికి జగనే కారణం

చిత్తూరు సిటీ, జూన్ 30: పోలవరం ప్రాజెక్టు దుస్థితికి చేరడానికి మాజీ సీఎం జగనే కారణమని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్ ఆరోపించారు. ఆదివారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ పోలవరం దుస్థితిపై సీఎం చంద్రబాబు వాస్తవాలను ప్రజల ముందు ఉంచుతుండటంతో సమాధానం చెప్పలేక జగన్, వైసీపీ నేతలు ముఖం చాటేస్తున్నారని పేర్కొన్నారు. 2014 -19 మధ్య చంద్రబాబు ప్రతి సోమవారమూ పోలవరం కార్యక్రమం నిర్వహించి 72 శాతం పూర్తిచేశారని చెప్పారు. 2019-24 మధ్య జగన్ రివర్స్ టెండరింగ్ పేరిట కాంట్రాక్టర్లను మార్చి పట్టించుకోకపోవడంతో ప్రాజెక్టు విధ్వంసమైందని చెప్పారు.

ఇంటింటికీ పింఛన్ పంపిణీ చేయాలి

పాలసముద్రం, జూన్ 30: లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేయాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి భీమనేని చిట్టిబాబు నాయుడు పేర్కొన్నారు. ఆదివారం పాలసముద్రం టీడీపీ కార్యాలయంలో పార్టీ నాయకులతో సమావేశమయ్యారు.

నేత్ర వైద్య శిబిరానికి అపూర్వ స్పందన



చిత్తూరు కల్చరల్, జూన్ 30: రాములగుడి వీధి జైన్ ప్రార్థనా మందిరంలో ఆదివారం చిత్తూరు జైన్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి నగరవాసుల నుంచి అపూర్వ స్పందన లభించింది. తిరుపతి అరవింద నేత్ర వైద్యశాల డాక్టర్ల సహకారంతో నిర్వహించిన శిబిరంలో 149 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు, కంటి అద్దాలు పంపిణీ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

విద్యార్థులకు ఆర్థికసాయం

చిత్తూరు కల్చరల్, జూన్ 30: కొంగారెడ్డిపల్లె ఉషానగర్‌కాలనీ బాలవికాస్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 22 మంది విద్యార్థులకు పుస్తకాల కొనుగోలు నిమిత్తం రూ.1000 చొప్పున ఆర్థిక సాయం అందించారు. సత్యసాయి సేవాసమితి జిల్లా అధ్యక్షుడు మధుసూదనం, కన్వీనర్ ఆర్.శేషనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు 29లోగా తెలుగుతల్లి విగ్రహం



గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యేలు జగన్మోహన్, మురళీ మోహన్

చిత్తూరు కల్చరల్, జూన్ 30: చిత్తూరు నగరంలో ఆగస్టు 29వ తేదీలోగా తెలుగు తల్లి విగ్రహం ఏర్పాటు చేయనున్నట్లు చిత్తూరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్, మురళీ మోహన్ తెలిపారు. విజయం కళాశాలలో చిత్తూరు హరివిల్లు లలితాకళా వేదిక ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత పత్తిపాటి రమేష్‌నాయుడు రచించిన పత్తిపాటి శతకరత్నావళి-3ను వారు ఆదివారం ఆవిష్కరించారు. చిత్తూరులో అన్ని బోర్డులు తెలుగులో ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం రచయితను ఘనంగా సత్కరించారు. ఆముదాల మురళి, మంజుల తేజోమూర్తి, భాస్కర్‌రెడ్డి, హరినాయుడు, మునుస్వామి పాల్గొన్నారు.

పెద్దిరెడ్డి కుటుంబాన్ని జిల్లా బహిష్కరణ చేయాలి : టీడీపీ



చిత్తూరు సిటీ, జూన్ 30: మాజీ మంత్రి పెద్దిరెడ్డి కుటుంబాన్ని జిల్లా బహిష్కరణ చేయాలని టీడీపీ నేతలు డిమాండ్ చేశారు. ఆదివారం టీడీపీ జిల్లా కార్యాలయంలో వారు మాట్లాడుతూ జిల్లాలో పెద్దిరెడ్డి కుటుంబం వల్ల శాంతి భద్రతలకు భంగం కలిగే అవకాశం ఉందన్నారు. పెద్దిరెడ్డి రాజకీయ జీవితం ముగిసిన అధ్యాయమని పేర్కొన్నారు. మిథున్ రెడ్డి రాజ్యాంగం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. పుంగనూరుకు రావద్దని ప్రజలు హెచ్చరిస్తున్నా బలవంతంగా ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడానికి ప్రయత్నించడం విడ్డూరంగా ఉందన్నారు. ఐదేళ్లుగా పుంగనూరు నియోజకవర్గంలో ప్రజలకు స్వేచ్ఛ లేకుండా చేశారని విమర్శించారు. టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్, చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, నేతలు మోహన్‌రాజ్, వెంకటేష్ యాదవ్, జాఫర్, ధరణి ప్రకాష్, కృష్ణమూర్తి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.